
రూ.6 కోట్ల భూమిపై వైసీపీ గద్ద వాలింది. కబ్జాలకు పేరుగాంచిన వైసీపీ నాయకుడు ఆ భూమిని అప్పనంగా కొట్టేయాలని కుట్ర పన్నాడు. హక్కుదారుల మధ్య భూవివాదాన్ని అనుకూలంగా మలుచుకున్నాడు. ఓ కూటమి నాయకుడు చేయి కలపడంతో వ్యవహారం నడిపాడు. రెవెన్యూ అధికారి ద్వారా అడ్డగోలుగా వన్‌బీలు సృష్టించాడు. చిలమత్తూరు మండలం చాగలేరు రెవెన్యూ పొలంలో సర్వే నంబర్లు 2-2, 3-1, 3-2, 4-2లలోని 24 ఎకరాల భూమికి హక్కుదారులుగా సృష్టించుకున్నాడు. కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకి అతి సమీపంలో భూమి ఉంది. ప్రస్తుతం ఎకరం రూ.25 లక్షల వరకు ధర పలుకుతోంది. దీంతో కబ్జాకి గురైన భూమి విలువ రూ.6 కోట్ల వరకు ఉటుంది. ఈ అక్రమాన్ని గుర్తించిన బాధితులు మోహన్‌కుమార్, ప్రసన్నకుమార్.. జాయింట్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. దీంతో వైసీపీ నాయకుడి కబ్జా పర్వం బయటపడింది. దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టిన జేసీ, వివాదాస్పదమైన వన్‌బీలను ఆన్‌లైన్‌లో డిస్ప్యూట్ కింద చేరుస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

\- చిలమత్తూరు, ఆంధ్రజ్యోతి

చాగలేరు వద్ద అక్రమంగా మ్యుటేషన్ చేసిన భూములు



రూ.6 కోట్ల భూమిపై వైసీపీ గద్ద..!

అనుచరుల పేరిట వన్‌బీలు

- అక్రమంగా మ్యుటేషన్
- చేతులు కలిపిన కూటమి నేత
- సహకరించిన రెవెన్యూ అధికారి
- జేసీకి బాధితుల ఫిర్యాదు
- వన్‌బీలను డిస్ప్యూట్ కింద పెడుతూ ఉత్తర్వులు

చాగలేరు వద్ద భూములను సుబ్బిరెడ్డి అనే వ్యక్తి నుంచి 1946లో నంజయ్య కొనుగోలు చేశారు. అతడి మనవలు మోహన్‌కుమార్, ప్రసన్నకుమార్‌కు వంశ పారంపర్యంగా భూమి సంక్రమించింది. వీరి మధ్య ఈ ఆస్తికి సంబంధించి పేచీలు రావడంతో కోర్టులో కేసులు వేసుకున్నారు. అవి నేటికీ నడుస్తున్నాయి. దీంతో ఆ భూములు కొన్నేళ్లుగా రెవెన్యూ రికార్డుల్లో అన్‌సెటిల్‌మెంట్‌గా ఉండిపోయాయి. దీనిని అదునుగా భావించిన చిలమత్తూరు మండలానికి ఓ వైసీపీ కీలక నాయకుడు ఆ భూమిపై కన్నేశాడు. ఎలాగైనా సొంతం చేసుకోవాలనుకున్నాడు. ఆ ఆస్తికి ఎలాంటి సంబంధంలేని, తన అనుచరులను హక్కుదారులుగా చూపిస్తూ వారికి 24 ఎకరాల భూమిని మ్యుటేషన్ చేయించుకున్నాడు.


ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నా..

చిలమత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న యునస్ బాబుకి గతేడాది అక్టోబరు 17న ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ఆయన పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయి. దాంతో ఆయనను ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఉన్నతాధికారులు జనవరి 16న ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన 23 వరకు కొనసాగారు. ఈ సమయంలో వివాదాస్పద చాగలేరు రెవెన్యూ పొలంలోని 2-2, 3-1, 3-2, 4-2 సర్వే నంబర్లలోని 24 ఎకరాల భూములకు ఎలాంటి విచారణ చేపట్టకుండానే అడ్డగోలుగా జనవరి 22న మ్యుటేషన్ చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌కు రూ.లక్షల్లో అందాయన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఆయనను బాధ్యతల నుంచి తప్పించినా.. బరితెగించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. మ్యుటేషన్ విషయంలో కిందిస్థాయి అధికారులతో చర్చించకుండానే నేరుగా ఆయనే అంతా కానిచ్చేశారు. ఒక భూమికి సంబంధించి మ్యుటేషన్ చేయాలంటే ముందుగా వీఆర్వో క్షేత్రస్థాయిలో విచారణ చేసి, స్టేట్‌మెంట్ ఇవ్వాలి. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరిశీలించాలి. సదరు భూమికి సంబంధించి డిప్యూటీ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించాల్సి ఉంటుంది. చాగలేరు భూముల మ్యుటేషన్‌లో కిందిస్థాయి అధికారుల పరిశీలనలు ఏవీ లేకుండానే వన్‌బీ చేసినట్లుగా బాధితులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం మారినా వైసీపీ నాయకుడిదే హవా?

గత వైసీపీ హయాంలో మండలానికి చెందిన ఆ పార్టీ కీలక నాయకుడు ఓ రేంజ్‌లో హవా నడిపాడు. కూటమి అధికారం చేపట్టినా ఆ నాయకుడు తగ్గేదేలా అన్నట్లుగా ప్రభుత్వ కార్యాలయాల్లో హవా సాగిస్తున్నాడన్నది బహిరంగ రహస్యమే. కూటమికి చెందిన ఓ నేత సహకారంతో భూమిని మ్యుటేషన్ చేయించుకున్నాడని తెలుస్తోంది. కూటమి నాయకుడి ప్రోద్బలంతోనే ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న యునస్‌బాబు హక్కుదారులకు కాకుండా వైసీపీ నాయకుడి బినామీలకు వన్‌బీ చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ వివాదాస్పద భూముల మ్యుటేషన్‌లో రూ.3 కోట్ల వరకు డీల్ కుదిరిందన్న చర్చ సాగుతోంది.





వివాదాస్పద భూములకు చేసిన మ్యుటేషన్

ఆశలు.. తీరేనా..?

- కొత్త, రద్దు చేసిన రైళ్లు పట్టాలెక్కేనా?
- నేటి కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులెన్నో..!
- విజయవాడకు కొత్త రైళ్లపై ప్రయాణికుల ఆశలు



4

కిటకిట..

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పోటెత్తిన జనం
- చివరిరోజు భారీగా రిజిస్ట్రేషన్లు
- నేటి నుంచి అమలులోకి భూవిలువల పెంపు



హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సందడి

పుట్టపర్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శుక్రవారం కిటకిటలాడాయి. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ జిల్లాలో భూములు, స్థలాల సవరించిన మార్కెట్ విలువల రిజిస్ట్రేషన్ ధరలు శనివారం నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద శుక్రవారం సందడి కనిపించింది. ఉదయం నుంచే ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రిజిస్ట్రేషన్ల కోసం జనం క్యూకట్టారు. రాత్రిదాకా కొనసాగాయి. కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారిగా రిజిస్ట్రేషన్ ధరలు పెంచుతోంది. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో రెండు నెలలుగా భూవిలువల సవరణపై ప్రభుత్వ ఆదేశాలతో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ కసరత్తు చేస్తోంది. జిల్లాలో పారిశ్రామిక కారిడార్, జాతీయ, రాష్ట్ర రహదారులు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని, సవరణ చేపట్టారు. శుక్రవారం రాత్రిదాకా జిల్లాలో భూవిలువల పెంపుపై కసరత్తు సాగింది. గత వైసీపీ ప్రభుత్వం ఎడాపెడా ధరలు పెంచడంతో అప్పట్లో స్థిరాస్తి వ్యాపారం కుదేలైంది. ప్రభుత్వ ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపింది. కూటమి ప్రభుత్వం భూవిలువల పెంపుదలపై ముందుగానే ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించింది. అందుకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలు పెంచింది. గత వైసీపీ ప్రభుత్వంలో సృష్టించిన అసమానతలను సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అప్పట్లో కొన్ని ప్రాంతాల్లో ధరలు ఎక్కువగా పెంచారు. ప్రస్తుతం అలాంటి వాటికి పెంపు మినహాయింపు ఇచ్చారు. అర్బన్, గ్రామీణ కమిటీల సూచన ఆధారంగా అభివృద్ధి ఇతర అంశాల ప్రాతిపాదికన వ్యవసాయేతర, వ్యవసాయ భూములుగా విభజించి, ధరలు నిర్ణయించారు. జిల్లావ్యాప్తంగా తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కనున్న భూములు, స్థలాలకు గరిష్ఠంగా ప్రస్తుత ధరలపై 10 నుంచి 20శాతం విలువల పెంపునకు ప్రతిపాదన చేశారు. ఇవి శనివారం నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఎంత పెరిగాయో అన్న టెన్షన్‌కు తెరపడనుంది.

భారీగా రిజిస్ట్రేషన్లు

సాధారణ రోజుల్లో హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండ, చిలమత్తూరు, చెన్నేకొత్తపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సగటున 30 నుంచి 60దాకా రిజిస్ట్రేషన్లు జరిగేవి. సాధారణ రోజులకన్నా శుక్రవారం అధికంగా డాక్యుమెంట్లు జరిగాయి. హిందూపురంలో సాయంత్రానికి వంద డాక్యుమెంట్లు దాటాయి. ధర్మవరంలో 120, కదిరిలో 102 దస్తావేజులు జరిగాయి. ఇలా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెద్దఎత్తున రిజిస్ట్రేషన్లు చేశారు. గురువారం నుంచే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుని, పూర్తి చేయించుకున్నారు. ధరలు పెంచినా ముందుగానే అభ్యంతరాలు, సూచనలు స్వీకరించడంతో జనం నుంచి వ్యతిరేకత రాలేదని తెలుస్తోంది. పెంపు నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు మూడురోజులుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు జనం భారీగా తరలి వచ్చినట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.


పూత పిందె లేదు..!

మామిడి తోటల్లో కనిపించని పూత

- ఫిబ్రవరి వచ్చినా అంతంత మాత్రమే..
- వాతావరణంలో మార్పులే కారణమంటున్న శాస్త్రవేత్తలు
- తోటలు కొనేందుకు ముందుకురాని వ్యాపారులు
- ఆందోళనలో రైతులు



పూతరాని మామిడి తోట



కొత్తచెరువు/గాండ్లపెంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేసవి రాబోతోందంటే అందరికీ గుర్తొచ్చేది ఫలరాజు మామిడి. జనవరి నాటికే మామిడి చెట్ల నిండా పూత ఉంటుంది. పిందెలు కూడా ఏర్పడతాయి. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఫిబ్రవరి వచ్చినా మామిడి చెట్లలో పూత కనిపించట్లేదు. పిందెలు ఏర్పడలేదు. దీంతో దిగుబడిపై అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే సేద్యపు ఖర్చుల కోసం వెచ్చించిన సొమ్ము కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. పూత రాకపోవడంతో తోటలు కొనేందుకు వ్యాపారులు వెనకడుగు వేస్తున్నారు. తోటల వైపే రావట్లేదు. వాతావరణంలో మార్పులే మామిడి చెట్లలో పూత ఏర్పడకపోవడానికి కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కారణం ఏదైనా అన్నదాతకు దిగుబడి దిగులు పట్టుకుంది.

మూడేళ్లుగా నష్టాలే..

జిల్లావ్యాప్తంగా 20 వేల హెక్టార్లలో మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. సాధారణంగా అక్టోబరులోనే మామిడి సీజన్ ప్రారంభమై, డిసెంబరు చివరి నాటికి తోటలు 90 శాతం పూత పూసి, పిందెలు ఏర్పడేవి. పూత, పిందెలతో తోటలు కళకళలాడాల్సిన సమయంలో కాండానికి మొగ్గ వస్తున్న దాఖలాలు కూడా కనిపించడం లేదని వాపోతున్నారు. ఫిబ్రవరి వచ్చినా మామిడి తోటల్లో అంతంత మాత్రమే పూత, పిందె కనిపిస్తున్నాయి. పంట వచ్చే వరకు నమ్మకం లేదు. ప్రతికూల వాతావరణ పరిస్థితులే ఇందుకు కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చలి తీవ్రంగా ఉంటుండడం, రాత్రి, పగలు ఉష్ణోగ్రతల్లో తేడా ఎక్కువగా ఉంటుండడంతో మామిడి చెట్లలో పూత ఏర్పడట్లేదని వారు చెబుతున్నారు. దీంతో మామిడి చెట్లు పూతరాక మొండిగా దర్శనమిస్తున్నాయి. మూడేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణాలతో మామిడి దిగుబడి రావట్లేదు. రైతులు, వ్యాపారులు నష్టపోతున్నారు. ఈసారి పరిస్థితి మరింత దారుణంగా ఉండడంతో తోటలు కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో రూ.300 కోట్ల నష్టం తప్పదా?

పంట దిగుబడి బాగుంటే చేసిన అప్పులు తీరుతాయని మామిడి తోటలకు ఎరువులు, పురుగు మందులు, సస్యరక్షణ తదితర సేద్యం ఖర్చులకు రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారు. వాతావరణ మార్పుల కారణంగా ఏ తోటకెళ్లినా ఒక్క మామిడి కాయ కూడా కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితులు కనిపించట్లేదు. దీంతో జిల్లావ్యాప్తంగా రూ.300 కోట్ల వ్యాపారం దెబ్బతినే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

వరుస నష్టాలను చవిచూస్తున్నాం



నాకు మరకుంటపల్లి వద్ద పదెకరాల్లో మామిడి తోట ఉంది. ఏటా తోటకు సస్యరక్షణ చర్యలు, ఎరువులు, పురుగు మందులు, సేద్యపు పనుల కోసం ఎకరాకు రూ.70 వేలు ఖర్చు వస్తోంది. ఐదేళ్ల కు మునుపు ఎకరాకు 5 టన్నుల దిగుబడి వచ్చేది. నాలుగేళ్లుగా దిగుబడి బాగా తగ్గిపోయింది. ఎకరాకు రెండు టన్నుల కాయలు కూడా రావడంలేదు. ఈ ఏడాది మామిడి తోటను చూస్తే భయమేస్తోంది. కనీసం సేద్యపు ఖర్చులు కూడా వస్తాయో.. రావోనని.. ఆందోళనగా ఉంది. **- నమస్తే శీనప్ప, రైతు, కొత్తచెరువు**

మామిడి తోటల కొనుగోలుతో నష్టం



రైతుల నుంచి గతేడాది మామిడి తోటలను కొనుగోలు చేశాం. ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో రూ.లక్షల్లో నష్టపోయాం. ఈ ఏడాది ఇప్పటి వరకు మామిడి పూత కూడా రాలేదు. దీంతో మామిడి తోటలు కొనుగోలు చేయడానికి జంకుతున్నాం. మామిడి తోటలకు మందులు ఎక్కువగా పిచికారీ చేయాల్సి వస్తోంది. కనీసం వాటి ఖర్చులు కూడా గతేడాది రాలేదు. దీంతో తోటలు కొనుగోలు ఆలోచనే చేయట్లేదు.

- రామకృష్ణ, వ్యాపారి, గాండ్లపెంట

వర్షాలతో పూత ఆలస్యం



అకాల వర్షాల కారణంగా నీటి శాతం ఎక్కువ కావడంతో మామిడి తోటల్లో పూత,మొగ్గ రావడం ఆలస్యమైంది. ఇదే పరిస్థితి జిల్లావ్యాప్తంగా కనిపిస్తోంది. దీంతో మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పూత రావడానికి మోనోక్రోటోపాస్ 2 ఎంఎల్, బోరాన్ 2 గ్రాములు, 13.0.45 దు 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మామిడితోటలకు బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. నమోదు చేసుకున్న రైతులకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం రూ.45 వేలు పరిహారం ఇస్తుంది.

- చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖాధికారి

వైసీపీ పాపాలకు ప్రాయశ్చిత్తం లేదు

- అభివృద్ధిలో ఆంధ్ర పరుగులు: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తమే లేదని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఎద్దేవా చేశారు. జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు చేసిన అరాచకాలు, ఆకృత్యాలు, దాడులు, దౌర్జన్యాలు, అన్నీఇన్నీ కావన్నారు. వారు చేసిన పాపాలకు 144 సంవత్సరాలకోసారి నిర్వహించే మహాకుంభమేళాలో మునిగినా మోక్షం వచ్చే 144 ఏళ్లకు కూడా లభించదన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో హైదరాబాద్‌కు బస్సు సర్వీసులను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ డిపో నుంచి ఐదు, జిల్లా నుంచి 85 బస్సు సర్వీసులను ప్రారంభించామన్నారు. గత వైసీపీ పాలనలో ఎనిమిది బస్సులు కూడా కొత్తవి వేసిన పాపాన పోలేదన్నారు. వైసీపీ చేసిన అప్పులు కట్టుకుంటూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కును నిలబెట్టుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తామనీ, వైసీపీ నాయకులు చింతించాల్సిన అవసరం లేదని మంత్రి చురకలు అంటించారు.



జెండా ఊపి, బస్సును ప్రారంభిస్తున్న మంత్రి సవిత



హిందూపురంలో పూజల్లో పాల్గొన్న మహిళలు



కదిరిలో ప్రత్యేకాలంకరణలో వాసవీమాత

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినం

హిందూపురం అర్బన్/కదిరి అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీమాత ఆత్మార్పణ దినాన్ని శుక్రవారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారి మూల విరాట్లకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. హోమాలు నిర్వహించారు. హిందూపురంలో భజనలు చేశారు. అనంతరం 101 రకాల పిండి వంటకాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



రేపటి ఉదయమై వస్తా..!



తూరుపు దిక్కున
ఉదయించినది మొదలు
విసుగు చెందక, విరామమెరుగక
జగతికి వెచ్చని వెలుగులు
పంచిన భానుడు..
రణ క్షేత్రంలో భీకరంగా పోరాడి,
రుధిర ధారలు పులుముకున్న వీరుడిలా
అరుణవర్ణంతో శోభిల్లుతూ...అలసి, సొలసి
ప్రకృతి అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ
విశ్రాంతి కోసం పడమటి దిక్కుకు పయణించే వేళ
గంగమ్మ ఎర్రనీళ్లతో దిష్టి తీస్తోంది.

చిత్రమైన సృష్టిలో ప్రకృతి గీసిన ఈ చిత్రాలను అనంతపురం నగర శివారు పండమేరు వద్ద శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.



నిధులు ఇస్తాం.. ప్రణాళిక సిద్ధం చేయండి

● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీ

అనంతపురం టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రికి ప్రత్యేకంగా నిధులు ఇస్తున్నామని, వాటితో ఆస్పత్రిలో పనులు చేయడానికి తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఇంజనీర్లకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. పెన్నార్‌భవన్‌లో ఉన్న జిల్లాప్రణాళిక కార్యాలయంలో ఎంపీ ల్యాండ్స్‌తో పనులు-నిధుల ఖర్చు తదితర వాటిపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో ఎంపీ ల్యాండ్స్, ఉపాధి నిధులను ప్రజలకు ఉపయోగపడే పనులకే ఉపయోగించాలన్నారు. అలాంటి పనులు ఏమైనా ఉంటే గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే వాటికి నిధులు వచ్చేటట్లు చేస్తానన్నారు. మంజూరైన నిధులతో ఆపనులను సకాలంలో పూర్తిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఇంజనీర్లకు సూచించారు. సీపీఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. పనులు పూర్తికాగానే బిల్లులను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి పంపాలని ఇంజనీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, డ్వామా, డీఆర్‌డీఏ, మునిసిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకోండి

● అనంతపురం ఈఎస్

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కల్లు గీత కార్మికులు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి ఐదో తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఫిబ్రవరి 7న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామన్నారు. జిల్లాలో 14 మద్యం షాపులను కల్లుగీత కార్మికులైన ఈడిగ, గౌడ్, గౌడ, గౌండ్ల, కళాలి కులస్థులకు కేటాయించినట్లు తెలిపారు. ఈడిగకు 9, గౌడ్‌కు 2, గౌడ, గౌండ్ల, కళాలి కులస్థులకు ఒక్కొక్కటి చొప్పున దుకాణాలు కేటాయించామన్నారు. ఈడిగ కులస్థులు గుంతకల్లు, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలు, కంబదూరు, గుమ్మఘట్ట, గుంతకల్లు రూరల్, రాప్తాడు, బెళుగుప్ప మండలాల్లో దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌడ్ కులస్థులు అనంతపురం నగర పాలక సంస్థ, గుత్తి రూరల్ మండలంలోని దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌడ రాయదుర్గం రూరల్, గౌండ్ల కులస్థులు డి.హీరేహాళ్, కళాలి కులస్థులు తాడిపత్రి మున్సిపాలిటీలోని దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని 10 ఎక్సైజ్ పోలీసు స్టేషన్లల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జిల్లాకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు నాన్‌రిఫండబుల్ దరఖాస్తు ఫీజు చెల్లించాలన్నారు. కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించినట్లు వివరించారు.

రేపు జీవజంత్ కళ్యాణ్ దివస్

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆదివారం జీవజంత్ కళ్యాణ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా ప్రాంతీయ పశు వైద్యశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి కొత్త విలువ

జిల్లాలో భూముల మార్కెట్ విలువ పెంపు

10 నుంచి 20 శాతం వరకూ..

గతేడాది పెంచని ప్రభుత్వం

రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయంపై ఆశలు

అనంతపురం క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువ పెంపునకు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో ప్రతి ఏటా ఆగస్టు సమయంలో భూముల విలువ పెంచుతూ ఉంటారు. గత ఏడాది కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై కసరత్తు చేసినా పలు కారణాలతో ఈ ప్రక్రియ వాయిదా పడింది. తాజాగా మార్కెట్ ధరలకు అనుగుణంగా భూముల విలువను సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో భూముల విలువ 10 నుంచి 20శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. గత ఐదేళ్లలో పోలిస్తే 2019లో ఒకసారి భూముల ధరలు పెరిగాయి. ఆ తరువాత కరోనా కారణంగా మూడేళ్లు భూముల విలువల్లో మార్పు చేయలేదు. కానీ 2023లో భూముల విలువ భారీగా పెరిగింది. గత ఏడాది పెరగలేదు. దీంతో కొనుగోలుదారులపై భారం పడనుంది.

ఎక్కడెక్కడ.. ఎలాగంటే..?

జిల్లా వ్యాప్తంగా భూముల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరగనున్నాయి. జిల్లా కేంద్రమైన అనంతపురం కార్పొరేషన్‌తో పాటు పలు పట్టణాల్లో అత్యధికంగా 15 నుంచి 20శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. అనంతపురం చుట్టుపక్కల భూములు అత్యధిక ధరలు పలుకుతున్నాయి. అనంతపురం అర్బన్ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో నారాయణపురంలో గజం ప్రస్తుతం రూ.5వేలు ఉండగా పెరిగిన ధరలతో రూ.6వేలుగా నిర్ణయించారు. కురుగుంట రూ.3600లు ఉండగా రూ.4వేలకు పెంచారు. రాచానపల్లిలో రూ.4వేల నుంచి రూ.5వేలకు, పాములరాయిలో రూ.5వేల నుంచి రూ.6వేలకు పెంచారు. అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని కక్కలపల్లి, రుద్రంపేట ప్రాంతంలో గజం రూ.6వేలు ఉండగా రూ.7వేలకు పెంచారు. ఆలమూరు, కట్టకిందపల్లిలో రూ.2500ల నుంచి రూ.2800ల వరకు పెంచారు. మన్నీల, చియ్యేడు, పూలకుంటలో రూ.700లు ఉండగా రూ.900లకు పెంచారు. కొడిమి, నరసనాయనికుంటలో రూ.1100ల నుంచి రూ.1400వరకు పెరగను న్నాయి. మేజర్ పంచాయతీ రాప్తాడుతో పాటు యర్రగుంట్ల, బొమ్మేపర్తి, బండమీదపల్లి ప్రాంతాల్లో గజం రూ.550ల నుంచి రూ.700లకు పెరుగనుంది. మరూరు, గొల్లపల్లి, చెర్లోపల్లి ప్రాంతంలో గజం రూ. 1100ల నుంచి రూ.1400వరకు పెరుగుతా యి. ఆత్మకూరు మండలంలో ఆత్మకూరు, పంపనూరులలో (రెసిడెన్షియల్, కమర్షియల్) ప్రాంతాలకు రూ.2వేల నుంచి రూ.2200 వరకు పెరగనున్నా యి. పి.యాలేరు, మదిగుబ్బ తదితర ప్రాం తాల్లో రూ.550ల నుంచి రూ.700ల వరకు పెరుగుతాయి. కూడేరు మండల కేంద్రంలో గజం రూ. 1100ల నుంచి రూ.1500ల వరకు, గొట్టుకూరులో రూ.2500ల నుంచి రూ.2800లవరకు చోళసముద్రం తదితర ప్రాంతాల్లో రూ.550ల నుంచి రూ.700వరకు పెరుగుతుంది. గార్లదిన్నె మండలం మర్తాడులో రూ.700ల నుంచి రూ.800ల వరకు, పెనకచెర్ల డ్యామ్ లో రూ.550ల నుంచి రూ.700ల వరకు పెరుగుతాయి. బుక్కరాయసముద్రం మండలంలోని గోవిందంపల్లిలో రూ.1800ల నుంచి రూ.2వేల వరకు, పొడరాళ్ల, రేగడికొత్తూరులలో రూ.2వేల నుంచి రూ.2200వరకు పెరుగుతాయి. గుంతకల్లు నియోజకవర్గంలోని కసాపురంలో గజం రూ. 1500 నుంచి 1700వరకు ఉంటుంది. కళ్యాణదుర్గం, రాయదుర్గం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో గజం రూ.1700ల నుంచి రూ.1900ల వరకు, రూ.2వేల రూ.2100వరకు పెరిగాయి.

పట్టణ ప్రాంతాల్లో

గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణాల్లో 10 నుంచి 20 శాతం మాత్రమే పెరగను న్నాయి. ఎక్కువగా 15శాతానికే పరిమితం కానున్నాయి. అనంతపురం నగరంలోని వినాయక్‌నగర్‌లో గజం రూ.18వేలుండగా రూ.19వేలకు పెరగనుంది. ఇక కమలానగర్ లాంటి కమర్షియల్ ప్రాంతాల్లో అయితే గజం రూ.40వేలుండగా రూ.42వేలకు పెరగనుంది. గుంతకల్లు పట్టణంలో గజం రూ.3500ల నుంచి రూ.4000వరకు పెరుగుతుంది. కమర్షియల్ ప్రాంతాల్లో మరో రూ.వెయ్యి పెరగనుంది. గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో 5 నుంచి 18.5శాతం వరకు భూముల ధరలు పెరగనున్నట్లు సంబంధిత రిజిస్ట్రార్లు చెబుతున్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలో ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ధరలు ఉండనున్నాయి. అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్‌లు రూ.1400లు ఉండగా రూ.1490లకు పెరగనుంది. ప్రతి అదనపు ఫ్లోర్‌కు రూ.30ల వరకు పెరుగుతుంది. కమర్షియల్ ప్రాంతాల్లో భవనాలకు సంబంధించి గ్రౌండ్‌ఫ్లోర్‌కు రూ.1800లు, ఫస్ట్ ఫ్లోర్‌కు రూ.1700, సెకండ్ ఫ్లోర్‌కు రూ.1590, సెల్లార్, స్టిల్ట్, పార్కింగ్ ప్లేస్‌కు రూ.1060ల వరకు పెరిగిన ధరలుగా నిర్ణయించారు.



అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ల కోసం వేచివున్న క్రయ, విక్రయదారులు

ఆదాయం పెరుగుతుందా...?

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు గత కొంతకాలంగా ఆదాయం తగ్గిందనడంలో ఎలాంటి సందేహం లేదు. 2023లో ఒకే సారి భూముల ధరలు అమాంతం పెరగడంతో రిజిస్ట్రేషన్ చార్జీలు సైతం పెరిగాయి. రియల్ ఎస్టేట్ రంగం పడిపోవడం లాంటి కారణాలతో భూముల రిజిస్ట్రేషన్లు తగ్గాయి. గత ఏడాది భూముల విలువలు పెరగలేదు. ఇప్పుడు కూడా 10నుంచి 15శాతం వరకే అధికంగా పెరగనున్నాయి. గత ఏడాది ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో తగినంత ఆదాయం రాలేదని రికార్డులు చెబుతున్నాయి. దీనికి తోడు అనంతపురం, అనంతపురం రూరల్ వంటి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గతంలో రోజుకు 80 నుంచి 110వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. కానీ కొన్ని నెలల పాటు రోజుకు కేవలం 30 నుంచి 40 డాక్యుమెంట్లకే పరిమితమయ్యే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ సారి ఆదాయం పెరుగుతుందనే భావిస్తున్నారు.

వ్యవసాయ భూములు ఇలా..

జిల్లాలోని వ్యవసాయ భూములు ఎకరాల వారిగా పెంపుదల కానుంది. ఉదాహరణకు కామారుపల్లి పంచాయతీ పరిధిలో డ్రై/వెట్/గార్డెన్ ఎకరా రూ.1.60లక్షలుండగా రూ.2.50లక్షలకు పెంచారు. అగ్రికల్చర్ ల్యాండ్ ఫిట్ ఫర్ హెచ్‌ఎస్ కింద రూ.3లక్షలుండగా రూ.6లక్షలకు పెంచారు. ఎన్‌హెచ్, స్టేట్ హైవే రోడ్ల పక్కనున్న వాటికి ఎకరా రూ.2.70లక్షలుండగా రూ.6లక్షలవరకు పెంచారు. హౌస్ సైట్స్ ఉన్న భూములు ఎకరా రూ.26.62లక్షలుండగా రూ.33.88లక్షలుగా పెంచారు. అదే కక్కలపల్లి పంచాయతీ పరిధిలో డ్రై/వెట్/గార్డెన్ కింద ఎకరా రూ.20లక్షలుండగా రూ.22లక్షల వరకు పెంచారు. ఎన్‌హెచ్, స్టేట్ హైవే రోడ్ల పక్కన ఎకరా రూ.82లక్షలుండగా రూ.90లక్షలకు పెంచారు. ఇలా పట్టణ ప్రాంతాలకు సమీపంలోని వ్యవసాయ భూముల కు, గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు, హైవేల పక్కన ఉన్న భూములకు ధరల్లో వ్యత్యాసం ఉంటుంది.



పోస్టర్లను విడుదల చేస్తున్న వైసీపీ నేతలు

ఫీజు పోరును జయప్రదం చేయండి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం క్రైం,జనవరి31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అండగా ఈనెల ఐదున వైసీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఫీజు పోరును విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలవుతున్నా ఒక్క రూపాయి చెల్లించలేదన్నారు. తాజాగా ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు. రూ.3900కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఐదో తేదీ ఉదయం 10.30గంటలకు జడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం ఉదయం ఆరు గంటలకే ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తారని తెలిపారు. జిల్లాలో 2,82,754 మంది పింఛన్‌దారులకు రూ.124.90 కోట్లు మంజూరైంది.

ఇన్‌చార్జ్ డీడీగా వెంకటేశ్వర్లు

అనంతపురం టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టరుగా కడప జిల్లా డీడీ వెంకటేశ్వర్లుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న రెగ్యులర్ డీడీ సరళ విజయకుమారి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో కడప డీడీకి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ఖజానాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సమగ్రశిక్ష వార్షిక బడ్జెట్‌పై చర్చ

అనంతపురం విద్య, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర ప్రాజెక్టు 2025-26 వార్షిక బడ్జెట్(ఏడబ్ల్యూపీ అండ్ బడ్జెట్) ప్రతిపానదలు సిద్ధం చేసేందుకు అధికారులు కసరత్తు మొదలెట్టారు. ఈక్రమంలోనే ఏపీసీ శైలజ సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులతో శుక్రవారం స మావేశం నిర్వహించారు. 2025-26 వార్షిక బడ్జెట్ కు అన్ని విభాగాల నుంచి సమగ్ర వివరాలను సేకరించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సివిల్ వర్కులు, ఫైనాన్స్, అకడమిక్ మానిటరింగ్ విభాగం (ఏఎంఓ), గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ విభాగం(జీసీడీఓ) ప్లానింగ్, అలెస్కో, ఐఈడీ, ఇంజనీరింగ్, ఎస్టాబ్లిష్ తదితర విభాగాల నుంచి వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు క్షుణ్ణంగా సేకరించాలన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ చంద్రశేఖర్‌రెడ్డి, వాణీదేవి, గోపాలకృష్ణ, నారాయణస్వామి, గురుమణికృష్ణ, సూపరింటెండెంట్ ఇక్బాల్ పాల్గొన్నారు.

5న అనంత ఉద్యాన సమ్మేళనం

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఫిబ్రవరి ఐదో తేదీన అనంత ఉద్యాన సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సమ్మేళనంలో జాతీయ, అంతర్జాయ స్థాయి కంపెనీల ప్రతినిధులు, కొనుగోలుదారులు, ఎగుమతిదారులు పాల్గొంటారు. ఉమ్మడి జిల్లాతోపాటు రాయలసీమలోని ఇతర జిల్లాల నుంచి ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు కానున్నారు. అరటి, చీనీ, మిరప, టమోటా, మామిడి పంటల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకే ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇదివరకు శుక్రవారం ఈ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించాలని భావించారు. అయితే అనివార్య కారణాల నేపథ్యంలో ఫిబ్రవరి ఐదో తేదీకి వాయిదా వేశారు.

ఆశలు.. తీరేనా..?

కొత్త, రద్దు చేసిన రైళ్లు పట్టాలెక్కేనా?

నేటి కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులెన్నో..!

విజయవాడకు కొత్త రైళ్లపై ప్రయాణికుల ఆశలు



నిర్మాణంలో ఉన్న గుంతకల్లు విద్యుత్ లోకో షెడ్



వివిధ రూట్లతో అనుసంధానించాల్సి ఉన్న 1, 2-3 ప్లాట్‌ఫారాల లైన్లు

గుంతకల్లు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌లో రైల్వేకు ఏమేరకు కేటాయింపులు జరుగుతాయోనని రైల్వే ఉద్యోగులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. రైల్వే ప్రత్యేక బడ్జెట్‌ను రద్దుచేసి, కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేసి తొమ్మిదేళ్లు పూర్తవుతోంది. అప్పటి నుంచీ ప్రతి ఏటా బడ్జెట్ ప్రసంగంలో రైల్వేల ప్రస్తావన తగ్గుతూ వస్తోంది. రైల్వేలకు గంపగుత్తగా నిధులను ఇవ్వడం, వందే భారత్ రైళ్లను ప్రకటించిమమ అనిపించడం ఆనవాయితీగా మారింది. తర్వాత విడుదల చేసే పింక్ బుక్‌లో వందే భారత్ రైళ్లు కాకుండా ప్రజావసరాల మేరకు డిమాండు ఉన్న రైళ్ల ప్రసక్తి ఉండటంలేదు. కాగా రాష్ట్రానికి కొత్త రైల్వే జోన్ రానున్న నేపథ్యంలో రాయలసీమ జిల్లాల నుంచి రాష్ట్ర రాజధానికి కొత్త రైళ్లు ప్రకటించాలన్న డిమాండ్ పెరిగింది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటైతే గుంతకల్లు రెండో అతి పెద్ద డివిజన్‌గా అవతరిస్తుంది. ఈ మేరకు గుంతకల్లు-విజయవాడ-విశాఖపట్నం మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది. దీంతో ఈ మార్గంలో కొత్త రైళ్ల ఆవశ్యకత ఏర్పడుతుంది. ఆ మేరకు ఈ బడ్జెట్‌లో కొత్త రైళ్లు ఏవైనా కేటాయిస్తారా? అన్న ఆసక్తి నెలకొని ఉంది.

రైళ్లు వచ్చేనా?

గుంతకల్లు రైల్వే డివిజన్ నుంచి గడచిన నాలుగేళ్లుగా కొత్త రైళ్లు, రద్దయిన పాత రైళ్లను నడపాలన్న డిమాండ్లు ఉన్నాయి. రైల్వే డివిజన్‌లో గతంలో నడచిన యశ్వంతపూర్-విజయవాడ ప్యాసింజరు, హుబ్లీ-విజయవాడ, కర్నూలు-గుంతకల్లు ప్యాసింజరు, బళ్లారి-గుంతకల్లు ప్యాసింజరు, రాయచూరు-గుంతకల్లు రైళ్లను కరోనా సమయంలో రద్దు చేసి పునరుద్ధరించలేదు. అలాగే కొల్హాపూర్-మణుగూరు ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. కిందటి నెలలో ఈ రూటులో ఓ ప్రత్యేక రైలును నడిపి తర్వాత రద్దు చేశారు. ముంబై-చెన్నై (16511/12) ఎక్స్‌ప్రెస్, ముంబై-చెన్నై మెయిల్ (నం. 17008/09) ఎక్స్‌ప్రెస్, హుబ్లీ-విజయవాడ రైళ్లను పునరుద్ధరించాల్సిన అవసరముంది. 2008లో గుంతకల్లు-కల్లూరు లైన్ గేజ్ కన్వర్షన్ సమయంలో గుంతకల్లు-ధర్మవరం ఫాస్ట్ ప్యాసింజరు రైలును రద్దు చేశారు. 2010లో కల్లూరు లైన్ పునఃప్రారంభం తర్వాత ఫాస్ట్ ప్యాసింజరును పునరుద్ధరించలేదు. ఈ రైలును మరలా నడపాలని పదిహేనేళ్లుగా స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గుంతకల్లు నుంచి విజయవాడకు వెళ్లడానికి అమరావతి, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లు మినహా తగిన రైళ్లు లేవు. కనుక రాష్ట్ర రాజధానికి కొత్త రైళ్లు రావాలని కోరుతున్నారు.

నిధులు ఏ మేరకో...

హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టడం, సరుకు రవాణా వేగవంతంగా జరిగేలా చేసే లక్ష్యంతో ఈ బడ్జెట్‌లో అధిక నిధులను కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన రైలు మార్గాలలో డబ్లింగ్ పూర్తిచేయడం, ట్రాక్ రీప్లేస్మెంట్, సరుకు రవాణా కోసం ట్రిపుల్, క్వాడ్రాపుల్ లైన్లకు అగ్రతాంబూలమిచ్చేలా కనిపిస్తోంది. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రైళ్లను 130 కిమీల వేగంతో నడపడానికి నిర్ణయించి, రైల్వే లైన్లు సక్రమంగా లేని కార ణంగా ఆ ప్రయత్నాన్ని విరమించారు. ఈ బడ్జెట్‌లో డివిజన్‌కు లైన్ల పునరుద్ధరణకు ఎక్కువ నిధులు లభించే అవకాశాలున్నాయి. గుంతకల్లులో పుష్కర కాలం నుంచీ నిర్మాణంలో ఉన్న ఎలెక్ట్రిక్ ట్రాక్షన్ షెడ్డు పూర్తి కావడం లేదు. అతి తక్కువగా నిధుల కేటాయింపు జరుగుతుండటంతో పనులు నత్తనడకన జరుగుతున్నాయి. షెడ్ నిర్మాణం పూర్తికి నిధుల కేటాయింపు జరగాల్సి ఉంది. గుత్తి-పెండేకల్లు, ధర్మవరం-పాకాల లైన్ డబ్లింగ్ కోసం నిధులు లభించే అవకాశాలున్నాయి. నిర్మాణం అంతిమ దశకు చేరిన గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్ ప్రాజెక్టుకు, కడప-బెంగళూరు, శ్రీకాళహస్తి-నడికుడి లైన్ల నిర్మాణ ప్రాజెక్టులకు నిధులు విడుదలయ్యే పరిస్థితి ఉంది. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోని 1, 2-3 ప్లాట్‌ఫాంలను విజయవాడ, చెన్నై లైన్లకు అనుసంధానం చేయడానికి గత బడ్జెట్‌లో అనుమతి ఇచ్చారు. నిధులు విడుదలకాక పనులు ప్రారంభం కాలేదు. ఆ పనులకు నిధులు లభించాల్సి ఉంది.

రైల్వే ఉద్యోగుల ఆశలు

రైల్వే ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న కొత్త పెన్షన్ స్కీం స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీం రావడంతో కాస్త శాంతించిన ఉద్యోగులు మరి కొన్ని డిమాండ్లను చేస్తున్నారు. కరోనా సమయంలో రావాల్సిన 18 నెలల డీఏను ఈ బడ్జెట్ ద్వారా విడుదల చేయాలని, కొవిడ్-19లో చనిపోయిన ఉద్యోగులకు రూ.50 లక్షల పరిహారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగులకు ఆదాయపు పన్ను విధింపు కనిష్ఠ ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని ఆశిస్తున్నారు. శిథిలమైపోయిన రైల్వే క్వార్టర్స్‌ను పునర్నిర్మించాలని కోరుతున్నారు. లోకో రన్నింగ్ స్టాఫ్‌కు లభిస్తున్న కి.మీ. అలవెన్సును ఆదాయపు పన్ను పరిధి నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

'కొవిడ్ రైళ్ల'ను నడపాలని కోరా



కొవిడ్-19 సమయంలో పలు ప్యాసింజరు రైళ్లు, ఎక్స్‌ప్రెస్‌లను నిలిపేశారు. వాటిని పునరుద్ధరించాలంటూ డీఆర్ఎం ద్వారా రైల్వే మంత్రిత్వ శాఖకు విన్నపం పంపాము. గుంతకల్లులో ట్రాఫిక్‌కు సమస్యగా మారిన ధర్మవరం గేటు, బళ్లారి బైపాస్ లెవెల్ క్రాసింగ్‌లను తొలగించి ఆర్‌యూబీలను నిర్మించాలని, రాష్ట్ర రాజధానికి గుంతకల్లు నుంచి ఎక్స్‌ప్రెస్, ప్యాసింజరు రైళ్లను నడపాలని ప్రతిపాదించాం.

-ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

ఆదాయ పన్ను మార్జిన్‌ను పెంచాలి



కేంద్ర ఉద్యోగులకు ఆదాయ పన్ను విధింపు స్లాబ్‌లను పెంచాలని కొన్నేళ్ల నుంచీ డిమాండ్ చేస్తున్నాం. కనీస ట్యాక్స్ మొత్తం రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉంది. గ్రూప్-4 ఉద్యోగులు పూర్తిగా ఆదాయపు పన్ను పరిధిలో లేని విధంగా స్లాబ్‌లను ఏర్పరచాలి. రైల్వే క్వార్టర్సు నిర్మాణ కార్యక్రమం కొన్నేళ్లుగా నిలిపి వేశారు. గత సంవత్సరం తొలిసారిగా అరకొర నిధులు ఇచ్చారు. డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లోనే వెయ్యి క్వార్టర్సును నిర్మించాల్సి ఉంది. ఇక సైడింగ్ స్టేషన్లలో ఉన్న క్వార్టర్స్ అన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. కరోనాలో పెండింగ్‌లో ఉంచిన రైల్వే ఉద్యోగుల డీఏ బకాయిలు, చనిపోయిన ఉద్యోగులకు రూ. 50 లక్షల పరిహారానికి సంబంధించి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.

- ప్రభాకర్, ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి

కేడర్ రీకన్‌స్ట్రక్షన్ చేయాలి



2023 నుంచి కేడర్ రీకన్‌స్ట్రక్షన్ జరగలేదు. ఉద్యోగులకు ప్రమోషన్లలో జాప్యం జరుగుతోంది. వెంటనే కేడర్ రీకన్‌స్ట్రక్షన్‌కు అనుమతులివ్వాలి. 8వ ఆర్థిక సంఘాన్ని నియమించారు. అది త్వరగా సిఫారసులను ఇవ్వడానికి తగిన విధంగా బడ్జెట్‌లో నిధులను కేటాయించాలి. రైళ్లను పెంచుతున్నారుగానీ, అందుకు తగినట్లు ఉద్యోగ నియామకాలు చేయడం లేదు. పని ఒత్తిడిని తగ్గించడానికి ఉద్యోగ నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి.

-విజయకుమార్, మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తాడిపత్రి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం సమీపంలో ఉన్న రజక కల్యాణ మండపం వద్ద శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 50సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహంపై నీలం రంగు చొక్కా, ఆకుపచ్చ ప్యాంట్ ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పాముకాటుతో రైతు..


వెంకటేష్(ఫైల్)

గుంతకల్లుటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైనాపురం గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ (55) శుక్రవారం పాముకాటుతో మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన మేరకు వెంకటేష్‌కు ఆరు ఎకరాల పొలం ఉంది. ఒక ఎకరంలో వేరుశనగ పంట సాగుచేశాడు. పంటకు నీరు పెట్టేందుకు వెంకటేష్ వెళ్లాడన్నారు. పొలంలో పాము కరవడంతో వెంకటేష్ స్పృహ తప్పిపడిపోయాడు. పక్కపొలంలోని రైతులు గుర్తించి వెంకటేష్‌ను వారి ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబసభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య తులశమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జుత్తు కత్తిరించిన కేసులో మరో 8 మంది అరెస్టు

పెనుకొండ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జుత్తు కత్తిరించిన కేసులో మరో ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు కియ ఇండస్ట్రియల్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ శుక్రవారం తెలిపారు. మండలంలోని మునిమడుగు గ్రామంలో ప్రేమజంటకు సహకరించిందని అదే ఊరికి చెందిన వెంకటలక్షిమపై జనవరి 14న యువతి కుటుంబ సభ్యులు విచక్షణారహితంగా దాడిచేసి, జుత్తు కత్తిరించారు. బాధితురాలు.. 20మందిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారిలో ఇదివరకే 11మందిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం మరో ఎనిమిది మందిని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ వివరించారు.

టమోటా కిలో రూ.20



అనంతపురం రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 750 టన్నుల టమోటాలు వచ్చాయని, కిలో సరాసరి ధర రూ.14, కనిష్ఠ ధర రూ.10 పలికినట్లు ఆయన తెలిపారు.

936 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయరుకు శుక్రవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 467 క్యూసెక్కులు వెళుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగాలకు 48మంది విద్యార్థుల ఎంపిక

అనంతపురం సెంట్రల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాబ్‌మేళాలో ప్రతిభ కనబర్చిన 48మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యలత అధ్యక్షతన శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. నైపుణ్యాభివృద్ధి, జిల్లా ఉపాధికల్పన, సీడాప్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఐదు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అనురాధ, నారాయణస్వామి పాల్గొన్నారు.

మిట్స్‌కు 4స్టార్ రేటింగ్

అనంతపురం సెంట్రల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ అనుబంధ మిట్స్ కళాశాలకు విద్యామంత్రిత్వ శాఖ 4స్టార్ రేటింగ్‌ను ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ప్రత్యేకంగా ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సెలింగ్(ఐఐసీ) సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. తద్వారా నూతన పరిశోధనలు, స్టార్టప్‌లపై అధ్యాపకులు, విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ కీర్తి నాదెండ్ల కృషితో 4స్టార్ ర్యాంకును సాధించామని హర్షాన్ని వ్యక్తంచేశారు.


విద్యామంత్రిత్వ శాఖ 4స్టార్ రేటింగ్ సర్టిఫికెట్‌ను అందుకున్న ప్రిన్సిపాల్ యువరాజ్

- అక్రమంగా కొండరాళ్లు, మట్టి తరలింపు
- కొండలు తవ్వడంతో గాలిమరల పరిస్థితి ప్రశ్నార్థకం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- భారీగా సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

కొండను కొట్టి... మట్టిని పట్టి..!

- మట్టి తరలింపుపై వివాదాలు


ఎ. కొండాపురం వద్ద మట్టి లోడింగ్‌కు వచ్చిన టిప్పర్లు

పుట్లూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సంపదను కొందరు స్వార్థపరులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. వీరి దెబ్బకు కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. అయితే అక్రమార్కుల జేబులు మాత్రం కాసులతో నిండిపోతున్నాయి. అనుమతులు లేకుండా మట్టిని తవ్వుతూ, టిప్పర్లు పెట్టి లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. మండలంలోని పుట్లూరు, చింతకుంట, ఏ. కొండాపురం, అరకటవేముల, సూరేపల్లి, కడవకల్లు, చాలవేముల, నారాయణరెడ్డిపల్లి, కొండుగారికుంట, గరుగుచింతలపల్లి, కోమటికుంట్ల, బాలాపురం, పి. చింతలపల్లి తదితర గ్రామాల్లో ఎక్కువగా కొండలు ఉన్నాయి. వీటిలో వ్యవసాయ భూములకు ఉపయోగించే కొండమట్టి, మరికొన్నిచోట్ల రోడ్లకు ఉపయోగించు గరుసుమట్టి ఎక్కువగా ఉంటోంది. ఈమట్టిని కొందరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్లు పెట్టి తవ్వుతూ టిప్పర్లతో రవాణా చేస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. చింతకుంట సర్వేనెంబరు 1లో సుమారు 800ఎకరాలకు పైగానే కొండ ప్రాంతం ఉంది. వీటిలో జాతీయ రహదారి 544-డీకి అనుమతులు తీసుకొని మట్టిని తరలిస్తున్నారు. కానీ వీటిని అడ్డుపెట్టుకొని కొందరు కాంట్రాక్టర్లు మట్టిని ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే ఏ. కొండాపురం పంచాయతీ పరిధిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఆ గ్రామ చంద్రదండు నాయకులు అడ్డుపడి టిప్పర్‌ను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. కానీ ఇలాంటి సంఘటన చింతకుంట గ్రామశివార్లలో కూడా జరిగింది. అక్కడ కొండప్రాంతాన్ని బ్లాస్ట్ చేసి, రాళ్లను సైతం క్రషర్లకు తరలిస్తున్నారు. అనుమతులు లేకుండానే ఈ కార్యక్రమాలు చేసుకుంటున్నట్లు సమాచారం. క్రషర్లకు కేటాయించిన భూమిలో కాకుండా ఇతరచోట్ల ఎక్స్‌కవేటర్‌తో రాళ్లను తవ్వేసి, కంకర ఫ్యాక్టరీలకు రవాణా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

గాలి మరల పరిస్థితి ప్రశ్నార్థకం

మండలంలో పెద్దఎత్తున వివిధ కంపెనీలకు చెందిన గాలిమరలు ఉన్నాయి. వీటిని కొండపైన ఏర్పాటు చేశారు. వీటి చుట్టుపక్కల ఉన్న మట్టిని సైతం తోడేస్తున్నారు. దీంతో గాలిమరల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ తవ్వకాలు ఇలాగే కొనసాగితే గాలిమరలు నేలకొరిగే ప్రమాదం ఉన్నట్లు ఆయా కంపెనీల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలిమరల చుట్టూ సుమారు వందమీటర్ల మేర ఎలాంటి నిర్మాణాలు, తవ్వకాలు చేపట్టకూడదని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. కానీ ఇక్కడ గాలిమరలకు దగ్గరగానే తవ్వకాలు చేస్తున్నారు. ఏ. కొండాపురం, అరకటవేముల, పుట్లూరు, నారాయణరెడ్డిపల్లి గ్రామాల శివార్లలో గాలిమరలకు దగ్గరగా కొండను తవ్వుతున్నారు.


నారాయణరెడ్డిపల్లి వద్ద గుట్టను తవ్విన దృశ్యం

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కొండల్లో మట్టి, రాళ్లను పెద్దఎత్తున తరలిస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మైనింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు కాంట్రాక్టర్లు అధికారులను కలిసి ఆమ్యామ్యాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు క్రషర్ యజమానులకు ఒక హెక్టార్‌కు మించి అనుమతులు ఇవ్వకూడదన్న నిబంధన ఉంది. కానీ ఇక్కడ మాత్రం హెక్టార్ సంగతి దేవుడెరుగు కొండ ప్రాంతంలో ఎక్కడైనా తవ్వుకొని రవాణా చేసుకో..! ఎవరు వస్తారో నేనుచూసుకుంటా అని ఓ అధికారి అభయం ఇచ్చినట్లు తెలిసింది.

పశువులను ఎక్కడికి తీసుకెళ్లాలి?



మండలంలో కొండలను తవ్వేసి రాళ్లు, మట్టిని అమ్ముకుంటున్నారు. ఇలానే కొనసాగితే కొండలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. మా ఊరి గ్రామశివారులో పెద్దఎత్తున కొండను తవ్వుతున్నారు. దీంతో కొండకు వెళ్లి మేతమేసే పశువులను ఇప్పుడు ఎక్కడికి తీసుకువెళ్లాలో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించి ఇలాంటి ఆగడాలను అరికట్టాలి.

- రామానాయుడు, సూరేపల్లి

నా దృష్టికి రాలేదు



కొండప్రాంతాల్లో మట్టిని తవ్వుతున్నట్లు నా దృష్టికి రాలేదు. వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. మట్టి తరలింపునకు ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఆయా గ్రామాల్లో మట్టిని అక్రమంగా తరలిస్తుంటే మాకు సమాచారం ఇస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- శేషారెడ్డి, తహసీల్దార్

సిండికాటు..!

- అరటివ్యాపారుల మిలాఖత్
- వారంలోనే అమాంతం తగ్గిన ధర
- టన్నుపై రూ.5వేల నుంచి రూ.7వేలు తగ్గింపు
- నష్టపోతున్న అరటి రైతులు


రాయలచెరువులో సాగుచేసిన అరటి పంట

యాడికి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు, చీడపీడలతో పోరాడి రైతన్న పంటను పండిస్తే కొందరు కేటుగాళ్లు సిండికేట్ అయ్యి అధిక దిగుబడిని కాటు వేస్తున్నారు. పంట దిగుబడి రాకమునుపు ఉన్న ధర చేతికొచ్చే క్రమంలో అమాంతం తగ్గించి వేస్తున్నారు. ప్రస్తుతం అరటి విషయంలో ఇదే జరుగుతోంది. వ్యాపారులు, వివిధ కంపెనీలు సిండికేట్ అయ్యి అరటి ధరను అమాంతం తగ్గించేశారు. టన్ను అరటిపై రూ.5వేల నుంచి రూ.7 వేల వరకు తగ్గించేశారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అరటి కొనుగోలు చేసే వివిధ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు జనవరి 30న నార్పలలో రహస్య సమావేశం నిర్వహించి సిండికేట్ అయ్యారని బాధితులు ఆరోపిస్తున్నారు.

వారంలోనే తేడా..

వారం రోజుల కిందట అరటి టన్ను రూ.25వేల నుంచి రూ.27వేల వరకు పలికింది. తాము పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని రైతులు సంతోషపడ్డారు. గతంలో అరటి మిగిల్చిన నష్టాలను ఈ ఏడాది తీర్చేసుకోవచ్చని ఆశపడ్డారు. కానీ వారి ఆశలపై కొనుగోలు కంపెనీలు, వ్యాపారులు నీళ్లు చల్లారు. తాము చెప్పిన ధరకు అయితేనే కొంటామని చెప్పుకుంటూ నాలుగురోజులుగా అరటి కొనుగోలును తగ్గించుకుంటూ వచ్చారు. జనవరి 30న అంతా ఒకచోట చేరి రహస్య సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. అక్కడ అరటి కొనుగోళ్లపై నిబంధనలు ఏర్పాటు చేసుకున్నట్లు రైతులు చర్చించుకుంటున్నారు. సమావేశంలో అరటి గ్రేడింగ్‌ను బట్టి టన్ను రూ.20వేల నుంచి రూ.22వేలకు మాత్రమే కొనుగోలు చేయాలని, అంతకు మించి ధర వెచ్చించరాదని నిర్ణయించినట్లు తెలిసింది. ఇదే అమలైతే పెద్దగా గిట్టుబాటు కాదని పలువురు అరటి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి అరటికి ఇరాన్, ఇరాక్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి పంటను కొనుగోలు చేసే కంపెనీలు అక్కడకు తరలించి మంచి లాభాలు ఆర్జిస్తున్నారని, కానీ రైతులకు ధర చెల్లించడానికి మాత్రం ఆలోచించడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. తాడిపత్రి నియోజకవర్గ పరిధిలోనే సుమారు 5వేల ఎకరాల్లో రైతులు అరటి సాగు చేశారు. మొదటి పంటలోనే లక్ష టన్నులకు పైగా దిగుబడి తీస్తారు. వ్యాపారులు టన్నుకు రూ.5వేల నుంచి 7వేల వరకు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. వ్యాపారుల సిండికేట్‌తో నియోజకవర్గ పరిధిలోని రైతులు అరటిపంట దిగుబడిపై సుమారు రూ.50కోట్లకుపైగా నష్టపోవాల్సి వస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యానశాఖ అధికారులు సంయుక్తంగా అరటి కొనుగోలు చేసే కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులతో చర్చలు జరిపి గిట్టుబాటు ధర కల్పించాలని అరటి రైతులు కోరుతున్నారు.

తీవ్ర నష్టం



వారం రోజుల కిందటి వరకు అరటి టన్ను రూ.27వేల వరకు ధర పలికింది. ఐదు రోజుల నుంచి అరటి దిగుబడిని వ్యాపారులు కొనకుండా నిలిపివేశారు. అరటి కొనుగోలు జరిపే వివిధ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు అంతా సిండికేట్ అయ్యి ధరను అమాంతం తగ్గించేశారు. అరటి టన్నుపై ఏకంగా రూ.5వేల నుంచి 7వేల వరకు తగ్గించడం దారుణం. దీనివలన అరటి రైతులు బాగా నష్టపోతారు. ఉద్యానశాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలి.

- పరిమి చరణ్, రైతు, రాయలచెరువు

టన్నుకు వంద కిలోల షూట్



అరటి కొనుగోలు చేసే వివిధ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు, సిండికేట్ అయి రైతులకు నష్టం కలిగించే విధంగా చేస్తున్నారు. వ్యాపారులు టన్నుకు వంద కిలోల షూట్ తీస్తున్నారు. ఇప్పుడు అంతా సిండికేట్ అయి అరటి ధరను అమాంతం తగ్గించేయడం తగదు. ఉద్యాన శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. అరటి రైతులు నష్టపోకుండా చూడాలి.

- కుమార్, అరటిరైతు, కొత్తపల్లి

మాకు వందమీటర్ల దూరంలో తొక్కిసలాట

విడపనకల్లు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన తొక్కిసలాటకు వందమీటర్ల దూరంలోనే తాము ఉన్నట్లు పలువురు భక్తులు వెల్లడించారు. విడపనకల్లుకు చెందిన వలిపిరెడ్డి వెంకటరమణారెడ్డి, అనంతపురానికి చెందిన కేశవరెడ్డి, శ్రీహరిరెడ్డి, కర్నూలుకు చెందిన గోపాలకృష్ణ స్నేహితులు. వీరు నలుగురూ నాలుగు రోజుల కిందట కారులో కుంభమేళాకు వెళ్లారు. ప్రయాగ్ రాజ్‌లో బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట సమయంలో వీరు అక్కడే ఉన్నట్లు తెలిపారు. అందరూ కలిసే ఉన్నా, తొక్కిసలాట తర్వాత ఎవరికి వారుగా విడిపోయారు. కారు పార్కింగ్ వద్దకు ఒక్కొక్కరుగా చేరుకోవటంతో నలుగురు మిత్రులు ఊపిరి పీల్చుకున్నారు. తొక్కిసలాట జరిగిన వెంటనే ఆ ప్రాంతంలో ఒక్కరిని కూడా ఉండనీయకుండా ఖాళీ చేయించినట్లు పేర్కొన్నారు.

కుంభమేళాకు బస్సులు



జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న పూల నాగరాజు

రాయదుర్గం రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు జిల్లా నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. మహాకుంభమేళా యాత్ర కు ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన రెండు బస్సులను శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా మహాకుంభమేళా యాత్రకు రాయదుర్గం నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. 11 రోజుల పాటు జరిగే ఈ యాత్రలో ప్రయాణికులు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, కార్గో డీఎంఈ నాగరాజు, గ్యారేజ్ ఇన్‌చార్జ్ శిరీష, అసిస్టెంట్ మేనేజర్ సురేంద్రబాబు, యూనియన్ నాయకులు తిప్పేస్వామి, రామలింగ తదితరులు పాల్గొన్నారు.

పురంలో విప్ రాజకీయం..!

పార్టీ మారిన వారిని భయపెట్టేందుకు వైసీపీ యత్నాలు

- ఆరు నెలల కిందటే సస్పెన్షన్
- అయినా.. విప్ జారీ యోచన
- సర్వత్రా విమర్శలు

హిందూపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విప్ రాజకీయానికి వైసీపీ ఎత్తులు వేస్తున్నట్లు సమాచారం. మున్సిపల్ చైర్మన్ ఉప ఎన్నికల్లో పార్టీ నుంచి సస్పెండ్ వారికి సైతం విప్ జారీ చేయాలని కుటిల రాజకీయానికి తెరలేపుతున్నట్లు తెలుస్తోంది. ఇది పట్టణంలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో నమ్ముకున్నవారికి ఏమీ చేయలేదనీ, ముఖ్యంగా ఓటేసిన వార్డులోని ప్రజలకు రూపాయి పనిచేసి పెట్టలేదని ఆ పార్టీ కౌన్సిలర్లు ఆవేదనకు లోనయ్యారు. వార్డు ప్రజలకు మొహం చూపించలేని పరిస్థితి ఎదుర్కొన్నారు. పార్టీలో ఉండటంకంటే టీడీపీలో చేరి వార్డు అభివృద్ధికి పాటుపడడమే మేలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని ఆరు నెలల క్రితమే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు కూడా. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ ఉప ఎన్నిక నేపథ్యంలో వైసీపీ కుతంత్ర రాజకీయానికి పూనుకుంది. పార్టీ మారిన వారిని భయపెట్టేందుకు విప్ అనే పదంతో ప్రయత్నిస్తున్నారు. పార్టీ మారినవారు ఏమాత్రం జంకకుండా అభివృద్ధి చేసేవారికే తమ మద్దతు ప్రకటించాలనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ అడుగు వెనకేసే ప్రసక్తేలేదని కరాఖండిగా చెబుతున్నారు.

భయపెట్టే ప్రయత్నం

హిందూపురం మున్సిపాలిటీలో 38 మంది కౌన్సిలర్లు ఉన్నారు. 2021 ఎన్నికల్లో 29 మంది కౌన్సిలర్లు వైసీపీ తరఫున గెలుపొందారు. వీరిలో 13మంది టీడీపీ వైపు వచ్చారు. సాధారణంగా గెలుపొందిన సభ్యుల్లో మరీ ముఖ్యంగా చైర్మన్ ఎన్నిక సందర్భంగా హాజరయ్యే సభ్యుల్లో 2/3 వంతు ఆమోదం తెలిపితే విప్‌పై చర్యలకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీవైపే మెజార్టీ సభ్యులున్నారు. అలాంటపుడు వారికి విప్ వర్తించదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వైసీపీ ముఖ్యనేతలు మాత్రం విప్‌తో రాజకీయం చేస్తూ పార్టీ మారిన వారిని భయపెట్టేందుకు ఈ పదం తెరపైకి తెచ్చినట్లు తెలుస్తుంది. ఒకవేళ విప్ జారీచేసినా, వారికి వర్తించినా వారు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వారి పదవీకాలం ఏడాది మాత్రమే ఉండటంతో గతంలో ఇలాంటివి వేరేచోట జరిగినపుడు కోర్టుకు వెళ్లగా ఏడాది, మూడేళ్లు పట్టింది. ముఖ్యంగా వైసీపీ విప్‌తో రాజకీయం చేయాలని భావిస్తే పార్టీ మారిన వారు టీడీపీ తరఫున కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు.

ఆరునెలల కిందటే సస్పెన్షన్

గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు కొంతమంది, ఆగస్టులో మరికొంతమంది వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని అప్పట్లోనే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అలాంటి వారికి ఇప్పుడెలా విప్ జారీ చేస్తారని పార్టీ మారినవారు ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడైనా తమ పార్టీ గుర్తుతో గెలుపొందినవారు పార్టీ ఫిరాయిస్తే వెంటనే సస్పెండ్ చేయాల్సిన అవసరం ఉంటుంది. ఆరు నెలల తరువాత చైర్మన్ ఎన్నిక కోసం విప్ జారీ చేయాలని భావిస్తే వారిని మరోసారి పార్టీ నుంచి సస్పెండ్ చేసి విప్‌పై పోరాడతారా, ఆరు నెలల క్రితమే సస్పెండ్ చేసిన దానిని పట్టుకుని విప్ జారీచేస్తారా వేచి చూడాలి. ఇది న్యాయపరంగా, రాజకీయపరంగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై న్యాయ నిపుణులతో సంప్రదించాక వైసీపీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. ఆరు నెలల క్రితమే తమను సస్పెండ్‌చేసి, ఇప్పుడు విప్ ఇవ్వడం వైసీపీకి సిగ్గుచేటని టీడీపీలోకి చేరిన వారు విమర్శిస్తున్నారు. వైసీపీ నీచ రాజకీయాలకు తెరలేపుతోందని ఆ పార్టీకి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మార్పు రాలేదంటూ టీడీపీ విమర్శలు గుప్పిస్తోంది. ఏది ఏమైనా హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికను వైసీపీ రాజకీయం చేయాలని భావిస్తోందనీ, అందులో భాగంగానే విప్‌ను తెరపైకి తెచ్చినట్లు చర్చ సాగుతోంది.



న్యూస్ బాక్స్

చెరువులకు నీటిని విడుదల చేయండి

బత్తలపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలపల్లి, రాఘవంపల్లి చెరువులకు, తాడిమర్రి మండలంలోని నారసింహపల్లి చెరువుకు పీఏబీఆర్ నీటిని విడుదల చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్ఎల్సీ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ చెరువులకు నీరు ఇవ్వాలని రైతులు మంత్రిని కొద్ది రోజుల క్రితం కోరారని, దీంతో మంత్రి శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారని చెప్పారు. సోమవారం నుంచి అదనంగా ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని మంత్రి సూచించినట్లు తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

పుట్టపర్తిరూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం వ్యాప్తంగా శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 41,648 మంది పింఛన్‌దారులకు రూ 18,23,500 పంపిణీ చేస్తామన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు హాజరుకావాలన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి వ్యక్తిగత కారణాలతో హైదరాబాదులో ఉన్నందున ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోతున్నారని తెలిపారు.

3 నుంచి పింఛన్ల సర్వే

గాండ్లపెంట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇంటింటి పింఛన్ల సర్వేను సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలో 58 మంది డయాలసిస్, వీల్‌చైర్, మంచానికి పరిమితమైన పింఛన్‌దారులు ఉన్నారని, వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరిలిస్తామని, పింఛన్‌దారులు ఇంటివద్ద ఉండి, వైద్య బృందానికి సహకరించాలని కోరారు.

విలీన ప్రక్రియను విరమించుకోవాలి

నంబులపూలకుంట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాఠశాలల విలీన ప్రక్రి యను విరమించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ కోరారు. శుక్రవారం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్జెక్టు ఉపాధ్యాయులతో బోధనంటూ సమీపంలోని ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలకు తరలించడంతో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు రామాంజులయాదవ్, రమణనాయక్, శివయ్య, సందీప్, రహీమ్, షఫీ, వెంకటరమణారెడ్డి, రమణయ్య, ముషీర్ అహ్మమద్, రామమోహన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

ఓబుళదేవరచెరువు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ రాబర్టు విల్సన్‌కు సీపీఐ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందించారు. నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. ఉపాధి పనులు కొన్ని గ్రామాల్లో మాత్రమే జరుగుతున్నాయని, చాలా గ్రామాల్లో పనులు ప్రారంభించలేదని అన్నారు. దీంతో ప్రజలు వలసపోయే ప్రమాదముందన్నారు. అధికారులు స్పందించి అన్ని గ్రామాలో ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చలపతి, రైతు సంఘం నాయకుడు పూల శ్రీనివాసులు, మహిళ సంఘం నాయకులు రత్నాబాయి, సుధాకర్, రమణ, రామచంద్ర, గంగులప్ప పాల్గొన్నారు.

ముళ్లచెట్ల తొలగింపు

ఓబుళదేవరచెరువు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని కసముద్రం, మహమ్మదాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపుల భారీగా పెరిగిన ముళ్లచెట్లను ఎస్ఐ వెంకటనారాయణ శుక్రవారం తొలగించేలా చర్యలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఇలా భారీగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఎస్ఐ వాటిని తొలగించేలా చర్యలు చేపట్టారు.

రేపు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కదిరిఅర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సును కుటాగుళ్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక ఆర్అండ్‌బీ భవనంలో వారు ఆవిష్కరించారు. ఇందులో పట్టణ తెలుగురైతు అధ్యక్షుడు శంకర్, యూనివర్సిల్ లైఫ్ స్కూల్ వ్యవస్థాపకుడు విశ్వంమాస్టార్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ

ధర్మవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్పందన ఆస్పత్రి, దేవినర్సింగ్ హోం, విజయలక్ష్మి ఆస్పత్రిని ఆర్డీఓ మహేశ్ శుక్రవా రం తనిఖీ చేశారు. ఆస్పత్రులు ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

చెత్త తొలగింపు

ధర్మవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'మన ధర్మవరం-మన స్వచ్ఛ సంకల్పం' కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు శుక్ర వారం మార్కెట్ యార్డ్‌లో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు మంజూరు చేయండి

బత్తలపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అర్హులై పేదలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు స్థానిక తహసీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం ఇచ్చారు. రేషన్ కార్డులు లేక అర్హులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మధు, కాటమయ్య, వెంకటేసు పాల్గొన్నారు.

భూముల రీసర్వే

గాండ్లపెంట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లి రెవెన్యూ గ్రామంలో భూముల రీసర్వే నిర్వహిస్తున్నారు. శుక్రవారం కత్తివారిపల్లి గ్రామంలో రైతుల భూ సరిహద్దులను కొలతలు వేశారు. ఈ కార్యక్రమం మూడు నెలలపాటు జరుగుతుందని, ప్రతి రైతు సర్వేకి సహకరించాలని తహసీల్దార్ బాబురావు కోరారు.

నగదు చెల్లించకండి

తాడిమర్రి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఏపీఎంఐపీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందజేసే బిందు, తుంపర సేద్య పరకరాలకు సంబంధించి రైతులు కేవలం ఆన్‌లైన్ పేమెంట్ ద్వారానే డీడీలు చెల్లించాలని, నేరుగా ఎవరికీ డబ్బు చెల్లించరాదని ఎంఐఏఓ శివశంకర్ తెలిపారు. పరికరాలు అవసరం అనుకున్న రైతులు ఫోన్‌పే, గూగుల్‌పే, ఆర్టీజీఎస్, నెట్ బ్యాంకింగ్ ద్వారా డీడీ కట్టుకోవాలన్నారు.

'కిశోరి వికాసం'పై అవగాహన

ఓబుళదేవరచెరువు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనిపల్లిలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహాలు, పోషకాహారం తదితర వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ ధనలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు షమీమ్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

నల్లమాడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి లక్ష్మనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలోని ల్యాబ్‌ను, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట జోనల్ హెల్త్ విస్తర్ణణాధికారి నిత్యపూజయ్య, ఫీల్డ్ అధికారి మహబూబ్‌బాషా, మలేరియా సబ్ యూనిట్ అధికారి దేవలనాయక్, సూపర్‌వైజర్ శశిధర్ ఉన్నారు.

మూగ రోదన..!


ఎన్ బడవాండ్లపల్లి సమీపంలోని చిన్న బావిలో ఉన్న మురుగు నీటిని తాగుతున్న గొర్రెలు

- దాహార్తితో పశువులు విలవిల
- నిరుపయోగంగా నీటితొట్టెలు
- నిర్వహణ లేక శిథిలావస్థలో..
- కుంటలు, రోడ్లపై నిల్వ ఉన్న మురుగు నీరే గతి
- ఇబ్బందులు పడుతున్న కాపరులు

నల్లమాడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పశువులు దాహార్తితో విలవిల్లాడుతున్నాయి. ఏ గ్రామంలో చూసినా పశువుల దాహార్తిని తీర్చడానికి పాడిరైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఇక.. వేసవిలో తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తం గా సుమారు తొమ్మిది వేల పాడి ఆవులు, రెండు లక్షలకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నట్లు పశువైద్యాధికారులు చెబుతున్నారు.

● నిర్వహణ లేక..

మూగజీవాల దాహార్తిని తీర్చడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో అనేక నీటి తొట్టెలను నిర్మించింది. మండలంలో 76 గ్రామాలకు గాను.. 50 గ్రామాల్లో నాడు టీడీపీ ప్రభుత్వం నీటి తొట్టెలు నిర్మించింది. ఆ త్వరాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదు. దీంతో నిర్వహణ లేక ఆ తొట్టెలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

● మురుగు నీరే గతి..

ప్రస్తుతం పశువులకు నీటి కోసం పాడి రైతులు, కాపర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల సమీపంలో కుంటలు, చెరువులున్నా వాటిలో చుక్క నీరు కూడా లేదు. బీటలు బారాయి. అరకొరగా కురిసిన వర్షాలకు కుంటలు, చెరువుల్లోకి నీరు రాలేదు. ఉన్న కొన్ని కుంటల్లో నీరు చాలా మురికిగా.. పురుగులు పట్టి ఉన్నాయి. వ్యవసాయ బోర్ల వద్దకు పశువుల దాహార్తిని తీర్చడానికి వెళ్తే.. పశువులు పంటను పాడుచేస్తాయని, ఇక్కడికి రావద్దని రైతులు నానా దుర్భాషలాడుతున్నట్లు కాపర్లు వాపోతున్నారు.

● పాలకులు స్పందించాలి

పైపులైన్ లేక... గ్రామాల్లో నీరు అరకొరగా ఉండడంతో ఉన్న కొద్దిపాటి తొట్టెలను నీటితో నింపడంలేదు. కురమాల, చౌటకుంటపల్లి, అప్పయ్యగారిపల్లి, కొండ్రవారిపల్లి, కుటాలపల్లి, వంకరకుంట, రాగానిపల్లి, రెడ్డివారిపల్లి, నల్ల మాడ, గోపేపల్లి, పోలంవారిపల్లి, బొగ్గలపల్లి తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. దీంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఎద్దులవాండ్లపల్లి, ఎద్దులవాండ్లపల్లితండా, పెమన కుంటపల్లి, అరవవాండ్లపల్లి, సుబ్బరాయునిపల్లి, చిల్లగోర్లపల్లి తదితర గ్రామాల్లో అసలు నీటితొట్టెలే లేవు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అన్నిగ్రామాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేసే లా.. ఉన్న వాటిని వినియోగంలోకి తెచ్చేలా చర్య లు తీసుకోవాలని కాపర్లు కోరుతున్నారు.


కొండ్రవారిపల్లిలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టె

వినియోగంలోకి తేవాలి..



మా గ్రామం వద్ద పశువుల దాహార్తిని తీర్చడానికి గతంలో రెండు నీటితొట్టెలను నిర్మించారు. వాటిలో ఒకటి శిథిలావస్థకు చేరుకుంది. మరో దానికి నీటి కొళాయి లేదు. దీంతో రెండూ నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తెచ్చేలా... గ్రామంలో మరిన్ని తొట్టెలు నిర్మించేలా పాలకులు చర్యలు తీసుకోవాలి.

- సోముశేఖర్‌రెడ్డి, కుటాలపల్లి

తొట్టెలు ఏర్పాటు చేయాలి



మా గ్రామంలో అధికశాతం పాడి రైతులున్నారు. అలాగే గొర్రెలు, మేకల కాపరులూ ఉన్నారు. గ్రామంలో మూగజీవాల దాహార్తిని తీర్చడానికి నీటి తొట్టెలు లేవు. గత వైసీపీ ప్రభుత్వం నీటితొట్టెలు ఏర్పాటు చేస్తామని చెప్పిందే తప్పా.. ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- మదనమోహన్‌రెడ్డి, ఎద్దులవాండ్లపల్లి

ఘనంగా అక్కదేవతల ఎలవగంప ఉత్సవం

ఓబుళదేవరచెరువు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపల్లి గ్రామంలో మాఘమాసం శుక్రవారం అక్కదేవతలకు ఎలవగంప ఎత్తే ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోయపల్లి గ్రామంలో పూజారి గంగులమ్మ స్వగృహంలో అక్కదేవతల కలిశాలకు పూజలు నిర్వహిం చారు. ఉరుములు, వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఎలవగంప తీసుకెళ్లారు. ప్రతి ఇంటి నుంచి పసుపు, కుంకుమ, గాజులను అక్కదేవతలకు సమర్పించారు. అక్క దేవతల ప్రతిమలుగా ఏడుగురు చిన్నారులకు పసుపు, కుంకుమ, పువ్వులు సమర్పించారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అలంకరణలో అక్కదేవతలు, అమ్మవార్ల ప్రతిమలుగా చిన్నారులు

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

ధర్మవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక చక్రవర్తి థియేటర్ సమీపంలోని కాల భైరవుడి ఆలయంలో శుక్రవారం మౌని అమావాస్య, కంకణధారణ పూజలు నిర్వహించారు. అమావాస్య గడియల్లో కూ ష్మాండ దీపోత్సవాన్ని ప్రారం భించారు. పట్టణంతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపోత్సవంలో పాల్గొన్నారు. భైరవుని ఎదుట గుమ్మడి కాయపై దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.


అలంకరణలో భైరవుడు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బత్తలపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఓంకారేశ్వర దేవాలయ వార్షికోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. మొదటి రోజున ఓకారేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు. శనివారం స్వామివారికి తెల్లవారుజాము నుంచి రుద్రాభిషేకాం, మహమంగళహారతి, మధ్యాహ్నం అన్న సంతర్పణం, సాయంకాలం గామోత్సవం నిర్వహిస్తామని అలయ దర్మకర్త కోటి సూర్యప్రకాష్ బాబు తెలిపారు.


జ్యోతిర్లింగాలు

టీపీఓ అవినీతిపై కౌన్సిలర్ల ధ్వజం

ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ తీర్మానం

ధర్మవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భవన నిర్మాణాలకు అనుమతుల విషయంలో టీపీఓ సాయిప్రసాద్ ఇష్టానుసారం ముడుపులు తీసుకున్నారని, గతంలో ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్లు ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. టీపీఓను ప్రభుత్వానికి సరెండర్ చేయాల్సిందేనని కౌన్సిలర్లు పట్టుబట్టారు. ఆ మేరకు కౌన్సిలర్ల ఆమోదంతో చైర్‌పర్సన్ తీర్మాణాన్ని ఆమోదించారు. వార్డుల్లో మున్సిపల్ అధికారులు పర్యటించినప్పుడు కనీసం సమాచారం ఇవ్వకుండా వస్తున్నారని కమిషనర్‌పై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం 4వ వార్డు జేసీబీ రమణ మాట్లాడుతూ.. కొందరు వైసీపీ పార్టీ తరఫున కౌన్సిలర్‌గా గెలిచి నేడు ఇతర పార్టీల్లోకి వెళ్లారని, వారు రాజీనామా చేసి ఆ పార్టీ గుర్తుతో గెలిచి సమావేశంలో రావాలని అన్నారు. దీంతో 27వ వార్డు కౌన్సిలర్ డోలా ఓబుళమ్మ మీరు రాజీనామా చేసి రండి.. ఎవరు గెలుస్తారో చూద్దామని సవాల్ విసిరారు. దీంతో కొద్దిసేపు వాగ్వావాదం జరిగింది. సమావేశంలో అనంతరం బయటకు రాగానే 27వ వార్డు కౌన్సిలర్ భర్త డోలా రాజారెడ్డి, జేసీ బీరమణ మళ్లీ వాగ్వా దానికి దిగడంతో పోలీసులు అక్కడి నుంచి వారిని పంపించేశారు.


టీపీఓను సరెండర్ చేస్తూ తీర్మానం చేస్తున్న కౌన్సిలర్లు

వాసవీమాత ఆత్మార్పణ దినం


ధర్మవరం : అమ్మవారిని ఊరేగిస్తున్న మహిళలు


తాడిమర్రి : వాసవీమాతను ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు

తనకల్లు జనవరి 31(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినం సందర్భంగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్థానిక వాసవీ మాతకు శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు రామాంజనేయులు, తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, తెలుగుదేశం నాయకులు రెడ్డిశేఖర్‌రెడ్డి, తోట సరోజమ్మ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

● నల్లచెరువు: మండలకేంద్రంలోని వాసవీకన్యకా పరమేశ్వరీ మాతకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు సమర్పించారు.

● ధర్మవరం: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆత్మర్పణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, కన్యకలు మంగళస్నానాలు ఆచరించి పాండురంగ స్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి మంగళవాయిద్యాలతో 102 కలశాలతో ఆర్య వైశ్య మహిళలు కన్యకాపరమేశ్వరి దేవి ఆలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ సర్వదేవత హోమాలు నిర్వహించారు. అమ్మవారికి క్షీరాభిషేకం, అమ్మవారికి ఒడిబియ్యం అందజేశారు. ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

●కొత్తచెరువు: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి సూచన మేరకు హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఇందులో పాల్గొన్నారు.

● తాడిమర్రి: స్థానిక వాసవీ మాత ఆలయంలో అమ్మవారిని కోనేరుబావి వద్ద నుంచి పవిత్ర గంగాజలంతో ఆర్యవైశ్యులు అభిషేకించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వాసవి మహిళా మండలిసభ్యులు పాల్గొన్నారు.

● బుక్కపట్నం: రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం మహా కార్యదర్శి ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, తల్లం మల్లికార్జున, వెంకటనారాయణ, గంగాధర్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.


తనకల్లు: ఆలయంలో ఎమ్మెల్యే కందికుంట


ధర్మవరం: పూజలో పరిటాల శ్రీరామ్

క్రైం న్యూస్ ..

నంది విగ్రహం మాయం

తనకల్లు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేట్‌బ్యాంక్ వీధిలో అనేక సంవత్సరాలుగా ఉన్న ఓ చిన్న నంది విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి అపహరించారు. గుప్తనిధుల కోసం దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని స్టేట్ బ్యాంక్ వీధి వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధురాలికి గాయాలు

ధర్మవరంరూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళనాయునిపల్లి గ్రామసమీపంలో రెండు ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో ధర్మవరానికి చెందిన ఖాజాబీ అనే వృద్ధురాలు గాయపడింది. శుక్రవారం వ్యవసాయ పనులకు వెళ్లిన ఖాజాబీ.. తిరిగి ఆటోలో ధర్మవరానికి ఆటోలో బయలుదేరింది. ఈ ఆటోను ఓబుళనాయునిపల్లి చర్చి వద్ద ఎదురుగా వచ్చిన మరో ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఖాజాబీ కాలికి బలమైన గాయమైంది. స్థానికులు ఆమెను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కేసు నమోదు

గాండ్లపెంట, జనవరి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లి వాసి చలపతినాయుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎన్పీకుంట ఇన్‌చార్జీ ఎస్ఐ వలీబాషా శుక్రవారం తెలిపారు. ఇతను కులం పేరుతో దూషించినట్లు అదే గ్రామానికి చెందిన రెడ్డెప్ప నాయక్ భార్య మేఘన ఫిర్యాదు చేసిందని, దీంతో అతనిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

మహిళపై దాడి

బత్తలపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మవరం రోడ్డులో విద్యాదరి పాఠశాల సమీపంలో నివాసముంటున్న సుహాసినిపై అశోక్ అనే యవకుడు శుక్రవారం కట్టెతో దాడి చేయడంతో అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సుహాసిని అనారోగ్యంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో వచ్చిన అశోక్.. డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. తన వద్ద లేవని సుహాసిని చెప్పడంతో కట్టెతో తీవ్రంగా దాడి చేసి వెళ్లిపోయాడు. బంధువులు సుహాసినిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో.. వారు కేసు నమోదు చేసుకున్నారు. అశోక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

స్టోర్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి

బత్తలపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని స్టోరీ డీలర్లు తహసీల్దార్ స్వర్ణలతను కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో స్టోర్ డీలర్లు మాట్లాడారు. ప్రభుత్వం మారి ఏడు నెలలు గడిచినా బఫర్ స్టాక్ ఇవ్వలేదని, దీంతో చాలా మంది పేదలకు బియ్యం ఇవ్వలేక పోతున్నామని వాపోయారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. స్టోర్లకు వచ్చే బియ్యం బస్తా 50 కేజీలకుగాను 40 కేజీలే వస్తున్నాయని వాపోయారు. బియ్యం దించే హమాలీలు అధిక డబ్బు కోసం వేధిస్తున్నారని మండి పడ్డారు. ఇలా అయితే స్టోర్లు నిర్వహించలేమని వాపోయారు.

● అధ్యక్షుడిగా సోమిరెడ్డి : మండల స్టోర్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా ఓబుళాపురం డీలర్ సోమిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ... డీలర్ల సమస్యల కోసం పోరాడుతానన్నారు. కార్యక్రమంలో రమణ, శ్రీరాములు, బొజ్జప్ప, సదాశివ పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

కొత్తచెరువు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ విద్యార్థిసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మోకాళ్లపై నిలబడి.. కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. అనంతపురం నారాయణ కళాశా లలో ఫీజుల వేధింపు కారణంగా విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నా డని, వెంటనే ఆ కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థిసంఘాల నాయకులు నాగార్జున, సకలరాజ, పవన్, పోతలయ్య, జగదీశ్, సాయి గౌతమ్, అమర్‌నాథ్‌రెడ్డి, హరిప్రసాద్, పురుషోత్తం పాల్గొన్నారు.

● విద్యాసంస్థల బంద్ విజయవంతం

కదిరిఅర్బన్: అనంతపురం నారాయణ జూనియర్ కళాశాలలో చరణ్ అనే విద్యార్థి ఆత్మహత్యను నిరసిస్తూ శుక్రవారం నిర్వహించిన ప్రైవేటు విద్యాసంస్థల బంద్ విజయవంతమైనట్లు విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, బాబ్‌జాన్, చంద్రశేఖర్, గణేష్, అఖిల్, అరుణ్, శ్రీకాంత్, భాను, సాయికుమార్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

పరిగి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు పొందకుండా బోరెడ్డిపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం సీజ్ చేశారు. అక్రమ ఇసుక రవాణాపై గత కొద్దిరోజులుగా పేపర్లలో కథనాలు ప్రచురించినా ఇసుక అక్రమదారులు మాత్రం తమకేమిపట్టనట్లు వ్యవహరించడంతో వారిపై ఉక్కుపాదం మోపినట్లు ఎస్ఐ రంగడు తెలిపారు. ఇకపై ఎవరు అక్రమంగా ఇసుక తరలించినా కఠిన చర్యలు తప్పవంటూ ఆయన హెచ్చరించారు.

నేడు కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

మడకశిర రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ అనంతపురం పంచాయితీ కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఏడిసిసి బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సురేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ఏపీ మార్కెటింగ్ వారి సహకారంతో ఏడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కందులు క్వింటాల్‌కు రూ.7550, రాగి క్వింటాల్‌కు రూ.4290గా ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతుల నుంచి వాటిని కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు చేసిన వాటిని నిలువ ఉంచడానికి రూ.40 లక్షలతో గోదాములు కూడా నిర్మించినట్లు తెలిపారు.

కందులను అమ్ముకోవడానికి వచ్చే రైతు తప్పనిసరిగా ఆధార్ కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం జెరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. రైతులకు రావల్సిన పది రోజులలో నేరుగా రైతు బ్యాంక్ ఖాతాలోకి జమచేస్తామన్నారు.

నేడు ఎమ్మెల్యేచే గోదాముల ప్రారంభం

ఏడీసీసీ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో ఆర్ అనంతపురంలో రూ.40 లక్షలతో గోదాములు నిర్మించినట్లు తెలిపారు. వాటిని , ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి శనివారం ప్రారంభిస్తారని తెలిపారు.

నేడు సామాజిక తనిఖీలపై ప్రజావేదిక

మడకశిరరూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో గత సంవత్సరం జరిగిన పనులపై అధికార బృందాలు తనిఖీ నిర్వహించాయి. వాటిపై శనివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కూలీలు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గిరిజన బాలికలకు వైద్య పరీక్షలు

గోరంట్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు పీహెచ్‌సీ వైద్యులు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థినులలో ఎర్రరక్తకణాలు గుండ్రంగా కాకుండా కొడవలి ఆకారంలోఉంటే వారికి సికిల్ సెల్ అనీమియా వ్యాధి ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇది వారసత్వంగా వచ్చేవ్యాధని, దీని వలన కీళ్ల నొప్పులు, చాతి నొప్పి తదితర సమస్యలు ఉంటాయన్నారు. నివారణ చర్యల్లో భాగంగా ఐరన్ అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, వైద్యాధికారులు సీహెచ్ఓ గాయత్రి, అనిత, విజయసాయి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డెత్ సర్టిఫికెట్ కోసం ఆందోళన



పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తమ కుమారుడు రెండు నెలల క్రితం చనిపోయాడని అందుకు సంబంధించిన డెత్ సర్టిఫికెట్ మంజూరు చేయడంలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం మండలంలోని మావటూరు సచివాలయం వద్ద పురుగుల మందుతో ఆందోళన చేశారు. నవంబరు 21న సుధాకర్‌రెడ్డి ఇంటిముందు పశువుల పాకలో ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి డెత్ సర్టిఫికెట్ కోసం కార్యాలయం చుట్టూ తిరిగినా ఇంతవరకు మంజూరు కాలేదని మృతుని భార్య హేమలత, తండ్రి రంగనాథ్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల సమస్యలు తెలుసుకుని ఆందోళన విరమింపజేశారు. ఈ విషయంపై పంచాయతీ అధికారి శ్రీరాములును వివరణ కోరగా సుధాకర్‌రెడ్డి డెత్ సర్టిఫికెట్ కోసం ధృవపత్రాలు ఆలస్యంగా అందించారన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో రికార్డ్ చేశామని మరో మూడు రోజుల్లో సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషిచేయాలి

పెనుకొండ టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్నిశాఖాధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది, పోలీసులు, కార్మికశాఖాధికారులతో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో బేకరీలు, వెల్డింగ్, మెకానిక్ షాపులు, హోటళ్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల్ని పనిలో పెట్టకుండా వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 31వరకు ప్రత్యేక బాల కార్మికుల నిర్మూలన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

రీయింబర్స్‌మెంట్‌పై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

మడకశిర టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 5న వైసీపీ తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమం ఓ నాటకం అని టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు జవనడుకు రంగా శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాట్లాడే హక్కు వైసీపీ నేతలకు లేదనీ, ఫీజులను నేరుగా కళాశాల యజమానులకే ప్రభుత్వాలు నేరుగా అందజేస్తున్నా వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రచార ఆర్భాటాల కోసం విద్యాదీవెన పేరిట విద్యార్థుల తల్లి దండ్రులను మోసం చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన మార్పు వల్ల డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఇతర కోర్సులు పూర్తి చేసి ఉన్నత విద్య చదివే అవకాశం లేక పలువురు ఉద్యోగ అవకాశాలను కోల్పోయారన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే!

- కుళ్లి.. కంపుకొడుతున్న వైనం
- మూడు, నాలుగు రోజులైనా తరలించని సిబ్బంది



ఆబాద్‌పేటలో రోడ్డు పైకి చేరిన చెత్త

హిందూపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొద్దిరోజులుగా అనేక వార్డుల్లో చెత్త కుప్పలుకుప్పలుగా పేరుకుపోతోంది. మూడు నాలుగు రోజులైనా తొలగించకపోవడంతో అది కాస్త ముగ్గిపోయి కంపుకొడుతోంది. కుక్కలు, ఆవులు ఆ చెత్త కుప్పలను చిందరవందర చేయడంతో వ్యర్థపదార్థాలు రోడ్డుపైకి చేరుతున్నాయి. అటుగా వెళ్ళే వారు కంపు భరించలేక ముక్కు మూసుకొని వెళుతున్నారు.

ఒకప్పుడు హిందూపురం మునిసిపాలిటీకి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉండేది. 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ మునిసిపల్ చైర్‌పర్సన్ రావిళ్ళ లక్ష్మి నేతృత్వంలో స్వచ్ఛభారత్ అవార్డు కూడా వచ్చింది. రాష్ట్రంలోనే ఏ1 మునిసిపాలిటీగా గుర్తింపు దక్కింది. అప్పట్లో చైర్ పర్సన్ లక్ష్మి ఉదయం లేవగానే ఏదో ఒక వార్డు పరిశీలనకు వెళ్లేవారు. మధ్యలో ఎవరైనా శానిటేషన్ బాగాలేదని ఫిర్యాదు చేస్తే స్వయంగా ఆమె ఆ ప్రాంతానికి సిబ్బందితో వెళ్ళి ఎప్పటికప్పుడు చెత్త కనిపించకుండా చేసేవారు. దీంతో మునిసిపాలిటీకి అవార్డులు, రివార్డులు దక్కాయి. ప్రస్తుతం పాలన కరువైంది. మునిసిపల్ చైర్‌పర్సన్‌లు మారడం, కౌన్సిలర్‌లు అటు ఇటు జంప్ కావడంతోనే కాలమంతా సరిపోయింది. ఇక వార్డుల్లో పరిస్థితి 'ఎవరికి పుట్టిన బిడ్డరా?' అన్న చందంగా తయారైంది. ఎవరికీ పట్టలేదు. ఏ పార్టీ వారు ఎంత ఇస్తారనే ఆలోచనే గాని, వార్డుల్లో పారిశుధ్యం గురించి ఆలోచించే వారు కరువయ్యారు. సిబ్బంది అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో పురంలో పారిశుధ్య పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడేపేరుకుపోతోంది. తడిచెత్త దుర్గంధభరితంగా మారి రోగాలకు దారితీస్తోంది.. కొన్ని ప్రాంతాల్లో పందుల సంచారం ఎక్కువ కావడంతో ఆ ప్రాంతాల్లో ప్రజలు రోగాలతో ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధర్మపురం, నానెప్ప నగర్, ముక్కిడిపేట, ఆబాద్‌పేట, లక్ష్మీపురం, హస్నాబాద్ తదితర చోట్ల చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ విషయంపై వివరణ కోరుదామని మునిసిపల్ కమిషనర్‌కు పలు మార్లు ఫోన్ చేసినా ఆయన అందుబాటులోకి రాలేదు.



ధర్మపురం బాలాజీ టాకీస్ వద్ద చెత్తలో కుక్కల సంచారం

'చెత్త నుంచి సంపద' నినాదం ఏమైంది?

ఓ పక్క 'చెత్త నుంచి సంపద' అని నినాదాలిస్తూ మరో వైపు చెత్తను అలాగే వదిలేయడంలో అర్థం కనిపించదు. సేకరించిన చెత్తతో ఎరువు తయారుచేసి రైతులకు ఇవ్వవచ్చు. బయోమాస్ ప్లాంట్లు ఏర్పాటుచేయవచ్చు. ఇంజనీరింగ్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్‌పై ప్రత్యేక సబ్జెక్ట్ ఉంది. ఇందులో చెత్తతో అనేక ఉపయోగాలు కనిపిస్తాయి. మునిసిపాలిటీ అధికారుల ఇంజనీరింగ్ పరిజ్ఞానం ఏమైందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు మీదకు వస్తున్నా తొలగించరు...

రోడ్డు అసలే చిన్నదిగా ఉంది. అందులో చెత్తను రోడ్డు పక్కన పడవేస్తున్నారు. దీంతో కుక్కలు,పందులు, పశువులు చెత్తను చిందరబందర చేస్తున్నాయి. ఎక్కువ రోజులు తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. నానెప్పనగర్ ఏటీఎం సందువద్ద చెత్త కుండీలను ఇండ్లకు దగ్గరగా పెట్టారు. వాటిని దూరంగా పెడితే సమస్య తీరుతుంది.

రాము, సీఐటీయూ పట్టణ కన్వీనర్

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

- అగళి మండల మీట్‌లో సభ్యుల డిమాండ్



హాస్టల్ వార్డెన్ సికిందర్‌ను మౌలికవసతులపై ఆరాతీస్తున్న ఎంపీపీ

అగళి, జనవరి 31(ఆంధ్రజ్యోతి):విద్యుత్ సమస్యలు, లోవోల్టేజి సమస్య పరిష్కరించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అగళి మండలపరిషత్ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రేణుక కామరాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ట్రాన్స్‌కో, ఆర్‌టీసీ, ఇరిగేషన్, అటవీ శాఖ, సెరికల్చర్, ఉద్యానశాఖ, తదితర అధికారులు హాజరు కాకపోవడంతో సభ్యులు మండిపడ్డారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ ఉమేష్ హాజరయ్యారు. ఈ సమావేశంలో అధికారులు సభ్యులకు పలు సమస్యలపై వివరించారు. వ్యవసాయశాఖ అధికారి శేఖర్‌నాయక్ మాట్లాడుతూ ఏపీ ఎంఎస్ ద్వారా రైతులకు ఐడికార్డు ఇస్తామన్నారు. రైతు సంఘం ద్వారా రూ.10లక్షల విలువచేసే డ్రోన్‌ను 80శాతం సబ్సిడీతో ఇ స్తామన్నారు. వైద్యులు మాట్లాడుతూ ఈనెల 11న మంచానికే పరిమితమైన 25మంది పెన్షన్‌దారుల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. ఏపీఓ శివన్న మాట్లాడుతూ ఇదివరకే 2024-25ఆర్థిక సంవత్సరంలో కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.6కోట్లు ఖర్చుచేశామన్నారు. అదేవిధంగా 41గోకులం షెడ్లు మంజూరు చేయించి నిర్మిస్తున్నామన్నారు. ఎంఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో తొమ్మిది పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి చదివే విద్యార్థులకు వాహన సదుపాయం చేయాలని సర్పంచ్ నరసింహమూర్తి విన్నవించారు. సర్పంచ్ ముద్దరాజు మాట్లాడుతూ హళ్లికెర ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సరిగా హాజరు కావడం లేదన్నారు. 20మంది భోజనాన్ని 50మందికి వడ్డిస్తున్నారన్నారు. ఇదివరకు పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, నియోజకవర్గ ఇన్చార్జ్ గుండుమల తిప్పేస్వామి చొరవతో అందించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ భాగ్యలక్ష్మీ, ఏపీఎం సురేష్, ఏపీఓ శివన్న, హౌసింగ్ ఏఈ కిషోర్, పీఆర్ ఇంజనీర్ అభిజీత్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విజయ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినం



పెనుకొండలో వాసవీమాత



గోరంట్లలో...

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అమ్మవారి పూజలకు కలశంతో వస్తున్న గుండుమల

పెనుకొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ వ్యాప్తంగా కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి నిర్ణయించడంతో పెనుకొండ తహసీల్దార్ శ్రీనాథ్ అమ్మవారి ఆలయానికి వెళ్లి పూలు, పండ్లు, వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమాలను పట్టణానికి చెందిన వ్యాపారవేత్త దేవతా సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రెండు వందల మందికి చీరల పంపిణీ

గోరంట్ల:పట్టణంలోని శ్రీవాసవి ఆలయంలో అమ్మవారిని అర్చకులు నాగేంద్రప్రసాద్ ప్రత్యేకంగా అలంకరించారు. తహసీల్దార్ మారుతి అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకు వచ్చారు. ఆత్మార్పారణ ప్రాముఖ్యతను ఆర్యవైశ్యసంఘం నాయకులు బలరాంగుప్త వివరించారు. ఆర్యవైశ్య సంఘం వారు రెండువందలమంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు

అగళిలో ఘనంగా ఆత్మార్పణ దినం

అగళి: అగళి మండల కేంద్రంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తూ కలశము మోస్తూ మొక్కుబడులు తీర్చుకున్నారు.

మడకశిరలో అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

మడకశిర టౌన్: పట్టణంలోని గాంధీ బజార్‌లోవెలిసిన వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కమీషనర్ రంగస్వామి పాల్గొన్నారు.

రొళ్లలో..

రొళ్ల:మండలంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో భాగంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈకార్యక్రమంలో కన్వీనర్లు, జడ్పీటీసీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, పాల్గొన్నారు.

మడకశిర ప్రధాన రహదారికి మహర్దశ

- నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరు కావడంతో ఊపందుకున్న పనులు



గతంలో దెబ్బతిన్న ప్రధాన రహదారి



ప్రస్తుతం మరమ్మతులు పూర్తయిన రహదారి

మడకశిర, జనవరి 31(ఆంధ్రజ్యోతి): భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న మడకశిర ప్రధాన జాతీయ రహదారి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఇటీవల రూ.16 కోట్లు మంజూరు చేయడంతో ఐదు సంవత్సరాలుగా దెబ్బతిన్న రహదారి రూపురేఖలు మారుతున్నాయి. ఈ రోడ్డు మరమ్మతులకు నోచుకోక పోవడంతో గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ప్రమాదాలు కూడా చోటు చేసుకొనేవి. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా కొద్ది రోజులకే అవి యథాస్థితికి వచ్చేవి. నేడు నిధులు మంజూరు కావడంతో ఆ రహదారి రూపురేఖలు మారుతున్నాయి. దీంతో గతంలో కంటే ప్రస్తుతం వాహనాల రద్దీ కూడా పెరిగింది. అనంతపురం నుంచి వాహనాలు మడకశిర వెళ్ళడానికి మూడు సంవత్సరాలు క్రితం పెనుకొండ, హిందూపురం మీదుగా వెళ్లేవి. ప్రస్తుతం కొడికొండ చెక్ పోస్టునుంచి మడకశిర మీదుగా వయా రొళ్ల అగళి వరకు హైవే రోడ్డు పూర్తికావడంతో వాహనాలు పెనుకొండ నుంచి మడకశిర మీదుగా శిరా, హిరియూరు, తుముకూరుకు వెళుతున్నాయి. దీనికితోడు మడకశిరలోని వజ్రపాళ్యం నుంచి మధుగిరి సర్కిల్ మీదుగా వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలవరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డును బిటి రోడ్డుగా మార్చడానికి రోడ్డు ఇరువైపుల కంప చెట్లను తొలగిస్తున్నారు. త్వరలోనే ఆ రహదారి రూపురేఖలు కూడా మారనున్నాయి.

నేడు పింఛన్ల పంపిణీ

గుడిబండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ గంగాధర్ కిందిస్థాయి అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని వితంతు, వికలాంగులు, వృద్ధులు, కల్లుగీత కార్మికులకు పింఛన్లను వందశాతం పూర్తిచేయాలని ఎంపీడీఓ సూచించారు.

టీడీపీ కార్యకర్తకు మంత్రి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సవిత

పరిగి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ మండల నాయకులు అంజినప్ప గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మంత్రి సవిత శుక్రవారం ఆయనకు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయన స్వగృహంలో రూ.25వేలు అందించారు. టీడీపీ తమకు ఎల్లప్పుడుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందుకున్న అంజినప్ప మంత్రికి, టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మారుతిప్రసాద్, భూషణ, విష్ణు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కెంచమాంబ ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో కెంచమాంబ దేవి

అమరాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల పరిధిలోని ఉదుగూరు గ్రామంలో వెలిసిన కెంచమాంబ దేవి జాతర ఉత్సవాలు గురువారం నుండి ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా దేవాలయ ప్రాంగణంలో వేద పండితులు గణపతిపూజ, కలశ స్థాపన, జలాధివాసం, క్షీరాధివాసం, మహా మంగళ హారతి, వాస్తుహోమం, తదితర కార్యక్రమాలను ప్రారంభించారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా పెద్ద ఎత్తున చేశారు. ఈసందర్భంగా శ్రీకెంచమాంబ సేవా సమితి సభ్యులు సిద్దేశ్వరగౌడ్, గోవర్ధన్, మూర్కణప్ప, శివకుమార్, బీరలింగప్ప, చంద్రశేఖర్ గౌడ్, ప్రకాష్, శివకుమార్, హనుమంతరాయప్ప, దేవాలయానికి సంబంధించిన అర్చకులు, యజమానులు ఏర్పాట్లను సిద్ధం చేశారు.

పనులకోసం పంచాయతీ కార్యాలయానికి తాళం

పావగడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధిహామీ పథకం నేడు పెత్తందారులు పాలకులకు వరంగా మారి పేదలకు శాపంగా మారిందని దొమ్మతిమరి గ్రామ పంచాయతీ చెన్నమ్మరెడ్డి హళ్లికి చెందిన ఉపాధికూలీలు ఆరోపించారు. పాలకులు పెత్తందారులు జేసీబీ యంత్రాలతో పనులు చేసి అధిక మొత్తంలో సొమ్ము చేసుకోవడంతో పేదలకు ఉపాధి పనులు కరువయ్యాయని దొమ్మతిమరి గ్రామ పంచాయతీ కార్యాలయ గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీకి చెందిన ఏడు గ్రామాలలో నరేగా పనులపై అవగాహన కల్పించాలని తాగునీటి కేంద్రాలు పాడైపోయి వేరే గ్రామాలకు వెళ్లి తెచ్చుకుంటున్నామని, ఆ గ్రామానికి చెందిన రామలింగప్ప ఆరోపించారు. ఈ క్రమంలో పీడీఓ రంగరామప్ప అక్కడికి వచ్చి ఇక ముందు ప్రతి గ్రామంలోనూ నరేగ పనులకు అవకాశం కల్పిస్తామని, ప్రతి గ్రామంలోనూ గ్రామసభల ద్వారా ఉపాధి పనులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించుకుని ఉపాధి పనులకు వెళ్లారు.

ఎన్‌సీసీతో ఉద్యోగావకాశాలు

హిందూపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ సర్టిఫికెట్ వల్ల ఉద్యోగాలలో రిజర్వేషన్ దక్కుతుందని, కాస్త కష్టపడి చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ కూడా ఉంటే ఉద్యోగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రిన్సిపాల్ సరళ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని చిన్మయా విద్యాయలయం ఆవరణంలో శుక్రవారం ఎన్‌సీసీకి సంబంధించిన టెంట్‌లు ఏర్పాటు చేశారు. శని, ఆది వారాల్లో రెండు రోజులు పాటు ఆంధ్రబెటాలియన్ ఆధ్వర్యంలో జరిగే ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షలకు 20 పాఠశాలల నుంచి 650 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. కమాండింగ్ ఏఎన్‌ఓలు, నవీన్‌కుమార్, ప్రత్యూష, టెంట్‌ల నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్త

అగళి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అగళి మండలం మధుడి పంచాయతీ మండల వ్యవసాయాధికారి శేఖర్‌నాయక్, వ్యవసాయ శాస్త్రవేత్త రామసుబ్బయ్య, మధుడిలో రంగనాథప్ప పొలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు రబీసీజన్‌లో చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం తదితర విషయాలపై సూచనలు అందించారు.

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

గుడిబండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకం అని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎంఈఓ గంగప్పలు పేర్కొన్నారు. గుడిబండ, ఎస్.రాయపురం ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదవీ విరమణ కార్యక్రమాన్ని గుడిబండలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తిస్తే విద్యార్థుల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. సమాజాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకం అన్నారు. కరియప్ప ఉపాధ్యాయ వృత్తిలో చేరి ఎంతో మంది విద్యార్థులకు విద్యను నేర్పించి విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం పదవీ విరమణ పొందిన కరియప్ప దంపతులను శాలువా కప్పి పూలహారాలు వేసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ప్రస్తుత టీడీపీ నాయకుడు లక్ష్మీనరసప్ప, ఉపాధ్యాయులు, ఎంఈఓ-2 రవిచంద్రకుమార్, మూడ్ల గిరియప్ప తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా.. వృద్ధురాలి మృతి

గోరంట్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై వడిగేపల్లి సమీపంలోని కె హోటల్ వద్ద ద్విచక్రవాహనం బోల్తా పడడంతో వెంకటమ్మ(75)మృతిచెందగా, మనవడు బాలక్రిష్ణ తీవ్రంగా గాయపడ్డారు. మల్లాపల్లికి చెందిన వెంకటమ్మ తన కుమారుడు మంజునాథ్ వద్ద ఉంటోంది. కుమార్తెను చూడడానికి గాను ఆమె ఇటీవల కర్ణాటకలోని నగరిగేరి సమీపంలోని నల్లైహళ్లికి వెళ్లింది. 1వతేదీ పింఛన్ తీసుకోవాల్సి ఉండడంతో తల్లిని తీసుకురావడానికి మంజునాథ్ తన కుమారుడైన బాలక్రిష్ణను అక్కడికి ద్విచక్రవాహనంలో పంపాడు. వెంకటమ్మ, బాలక్రిష్ణలు ఇరువురు ద్విచక్రవాహనంలో మల్లాపల్లికి వస్తుండగా వడిగేపల్లి కె.హోటల్ సమీపంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. జాతీయ రహదారిపక్కన గల నెంబర్ రాయిని ఢీ కొనడంతో వెంకటమ్మ ముఖం ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందగా, బాలక్రిష్ణకు కుడికాలు విరిగింది. వారిని 108లో చికిత్స నిమిత్తం హిందూపురం తరలించారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.